Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 161 మేడ్చల్ మల్కాజ్‌గిరి 2 జూలై 2023 ఆదివారం పేజీలు : 4

## కేంద్రం ఆర్డినెన్స్‌ను సుప్రీంకోర్టులో సవాలు చేసిన 'ఆప్'

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగవిరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఏఏ ప్రకారం ఎన్నికైన ప్రభుత్వానికి ఉన్న అధికారాలను ఎన్నికకాని ఎల్జీ చేతుల్లోకి తీసుకువచ్చేలా ఎలాంటి సవారణ చేయరాదని ఆ పిటిషన్‌లో ఆప్ సర్కార్ పేర్కొంది. దేశరాజధానిలోని ఐఏఎస్, డీఏఎన్ఐసీఎస్ అధికారుల బదిలీలు, నియామకాల అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు వర్తింపజేస్తూ మే 19న కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు గత ఆదేశాలను ఉల్లంఘిస్తూ కేంద్రం ఈ ఆర్డినెన్స్ తెచ్చిందని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది.



# సగానికిపైగా అభ్యర్థులు రెడీ!

## జూలైలో 70 మంది క్యాండిడెట్లను ప్రకటించేందుకు సిద్ధమవుతున్న తెలంగాణ కాంగ్రెస్

# అధిష్టానం అనుమతే తరువాయి!!

హైదరాబాద్ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన విజయం సాధించి దూకుడు మీదున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోనూ అధికారంలోకి రావడానికి సర్వసన్నద్ధమవుతోంది. పార్టీ అగ్ర నేతలంతా విభేదాలు వీడి సమైక్యంగా అడుగులేస్తుండటంతో ఆ పార్టీ రెట్టించిన ఉత్సాహంతో ఉరకలేస్తోంది. మరోవైపు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేరుతుండటంతో కాంగ్రెస్ పార్టీలో జోష్ నెలకొంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ ప్రియాంకలు తెలంగాణలో పర్యటించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాహుల్ గాంధీ జూలై మొదటి వారంలోనే రాష్ట్ర పర్యటనకు రానున్నారు. పొంగులేటి జూపల్లి చేరికలు రాహుల్ సమక్షంలోనే ఉంటాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా ముందుగానే ప్రకటించనున్నారని తెలుస్తోంది. గతంలో నామినేషన్ల వరకు చివరి రోజు వరకు కూడా అభ్యర్థులను ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధం కావడానికి ప్రచారం చేసుకోవడానికి ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి ఇబ్బందులు తలెత్తాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి ముందుగానే అభ్యర్థులను ప్రకటిస్తే ఇలాంటి ఇబ్బందులు తొలగించవచ్చని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో ముందుగా 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని అంటున్నారు. గట్టి అభ్యర్థులు ఉన్న చోట టికెట్ కోసం ఎలాంటి విభేదాలు లేని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు తమ అభ్యర్థులను ముందుగానే ప్రకటించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్ నేత భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట రెడ్డి కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ మెజారిటీ స్థానాలకు అభ్యర్థులను జూలైలోనే ప్రకటిస్తుందని ఆయన తాజాగా తెలిపారు. ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ పడుతున్న స్థానాలు వివాదాస్పద స్థానాలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేనిచోట అభ్యర్థుల ప్రకటన ఉంటుందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ క్రమంలో జూలైలో కనీసం 70 సీట్లకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తుందని ఆయన వివరించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేతలతో జరిగిన వ్యూహ కమిటీ సమావేశానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులను ముందుగానే ప్రకటిస్తే సీటు కోసం లాబీయింగులు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యూహ కమిటీ సమావేశంలో పార్టీ మేనిఫెస్టోను ఖరారు చేయాలని ఎవరికి టిక్కెట్లు ఇవ్వవచ్చో తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వానికి రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. అభ్యర్థుల ఎంపిక మేనిఫెస్టోను రూపొందించి ఢిల్లీకి నివేదిక పంపాలని రాహుల్ గాంధీ తమను ఆదేశించారని కోమటిరెడ్డి చెప్పారు. అదేవిధంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ హైకమాండ్ కూడా స్పష్టం చేసిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. తాను లోక్సభ ఎన్నికలకు కాకుండా అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేస్తానని కోమటిరెడ్డి చెప్పారు. ఇదే తనకు చివరి ఎన్నికలని ఆ తర్వాత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.

# కౌశిక్ రెడ్డికి బిగ్ షాక్... తెర పైకి కొత్త పేరు!

హుజూరాబాద్ : వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తున్న బీఆరెస్స్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డికి కేసీఆర్ బిగ్ షాక్ ఇవ్వనున్నారనే ఊహాగాణాలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో హల్ చల్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా తెరపైకి మరో పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తుండటం గమనార్హం. హుజూరాబాద్ నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో బలం పెంచుకొని ఎన్నికలలో ఈటలను బలంగా ఢీ కొడతాడు అని అధినేత భావిస్తే... కౌశిక్ రెడ్డి మాత్రం వరుస వివాదాలతో దర్శనమిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో ఈ మధ్యకాలంలో ప్రధానంగా ఒక వీడియో జర్నలిస్టుపై దురుసుగా ప్రవరించారని కెమెరా లాక్కుని కులంపేరుతో దూషించారంటూ వచ్చిన వార్తలు మరీ హాట్ టాపిక్ గా మారాయి. ఇదే సమయంలో కౌశిక్ రెడ్డిపై డీజీపీకి ఫిర్యాదు చేశారు ముదిరాజ్ సంఘం నేతలు. జూన్ 22న హుజురాబాద్ లో ముదిరాజ్ కులాన్ని కించపరిచే విధంగా కౌశిక్ రెడ్డి మాట్లాడారని.. ఒక కెమెరా మెన్ ను కులం పేరుతో తిట్టి అవమానించారని.. అతన్ని కఠినంగా శిక్షించాలని డీజీపీని కోరామని ముదిరాజ్ సంఘం నేతలు తెలిపారు. ఇలా వరుసగా వస్తోన్న వివాదాల



నేపథ్యంలో... హుజూరాబాద్ లో ఈటలపై పోటీకి కౌశిక్ కరెక్ట్ క్యాండిడేటేనా అనే విషయంలో కేసీఆర్ పునరాలోచనలో పడ్డారని వార్తలొస్తున్నాయి. వాస్తవానికి కౌశిక్ రెడ్డిని కేటీఆర్ బాగా ప్రోత్సహించినట్లు కనిపించేది. ఎమ్మెల్సీ టిక్కెట్ ఇవ్వడంతోపాటు ఈ మధ్యకాలంలో హుజూరాబాద్ ఇన్ ఛార్జ్ ని చేశారు. తాజాగా హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచేది పాడి కౌశిక్ రెడ్డే అతని విజయానికి సహకరించండి అంటూ కేటీఆర్ ప్రకటించారు! దీంతో స్థానికంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ వర్గం తీవ్రంగా కౌశిక్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించింది.

దీంతో తాజాగా ఈటల రాజేందర్ పై పోటీకి ఇనుగాల పెద్దిరెడ్డిని దింపాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారంటూ ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డికి ఈసారి బీఆరెస్స్ టికెట్ ఇస్తే ఎలా ఉంటుందనే విషయంపై కేసీఆర్ ఇప్పటికే అభిప్రాయాలు సేకరిస్తున్నారనేది ఆ వార్త సారాంశంగా ఉంది. మరి నిజంగానే కౌశిక్ రెడ్డి విషయంలో కేసీఆర్ సెకండ్ థాట్ కి వెళ్తున్నారా.. లేక ఇవన్నీ ఊహాగాణాలు మాత్రమేనా అనేది తెలియాల్సి ఉంది! కాగా... 2018 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన కౌశిక్ రెడ్డి... ఈటల రాజేందర్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఈటలకు 43719 మెజారిటీ వచ్చింది. అనంతరం కౌశిక్ రెడ్డి బీఆరెస్స్ లో చేరి ఎమ్మెల్సీ అయ్యారు. ప్రస్తుతం హుజూరాబాద్ బీఆరెస్స్ ఇన్ ఛార్జ్ గా ఉన్నారు.

## తెలంగాణలో అందుబాటులోకి 134 ఉచిత వైద్య పరీక్షలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 134 ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ద్వారా అందించే ఈ వైద్య పరీక్షలను వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 డయాగ్నొస్టిక్స్ సెంటర్లు, 16 రేడియాలజీ సెంటర్లను అందుబాటులోకి వచ్చాయి. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. "తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ద్వారా ఇప్పటివరకు 54 పరిక్షలు ఉచితంగా చేస్తున్నారు. మరో 134 వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చాం. పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను రోగి, వైద్యుల మొబైల్‌కు పంపిస్తాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టిఫా స్కాన్, 2డి-ఎకో రేడియాలజీ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాం" అని హరీశ్‌రావు తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. "కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు చాలా కష్టపడ్డారు. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా మార్చారు. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులకు దీటుగా మార్చారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కేసీఆర్ కిట్, గర్భిణులకు కేసీఆర్ పౌష్టికాహార కిట్ అందిస్తోంది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30శాతం ప్రసవాలు జరిగితే.. ఇప్పుడు 70శాతం అవుతున్నాయి. పేద ప్రజలకు నిమ్స్‌లో అత్యాధునిక వైద్యం అందిస్తున్నాం" అని హరీశ్‌రావు వెల్లడించారు.




# విజయానికి చేరువగా...!

## భట్టి పాదయాత్రతో

# 'హస్తవాసి' మారిందిగా...!!

ఖమ్మం : తెలంగాణపైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో రాజకీయాల పైన ఎప్పటికప్పుడు సర్వేలు తెప్పించుకుంటున్నారు. ఆ నివేదికల ఆధారంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ యాత్ర గురించి తాజాగా రాహుల్ గాంధీ ఆరా తీసారు. రాష్ట్ర ఇంఛార్జ్ థాక్రేతో పాటుగా ముఖ్య నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సుదీర్ఘంగా యాత్ర కొనసాగిస్తున్న భట్టి ప్రధానంగా పేద ప్రజలతో మమేకం కావటం..వారి సమస్యల పైన సానుకూలంగా స్పందించటం పార్టీకి కలిసొచ్చే అంశంగా నేతలు రాహుల్ కు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పైన భట్టి ఎక్కువగా దృష్టి పెట్టారని..వాటి పైన స్పందిస్తున్న తీరుతో ప్రజల నుంచి పార్టీకి మరింత ఆదరణ పెరుగుతోందని రాహుల్ కు నివేదికలు అందాయి. కర్ణాటక తరువాత దక్షిణాదిన తెలంగాణ కాంగ్రెస్ కు కీలకంగా మారింది. తెలంగాణలో భట్టి విక్రమార్క్ పీపుల్స్ మార్చ్ యాత్ర కాంగ్రెస్ అగ్ర నేతల దృష్టిని ఆకర్షించింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అధికారం.. ప్రధానిగా రాహుల్ లక్ష్యమని భట్టి ప్రకటించారు. రాహుల్ నిర్వహించిన జోడో యాత్ర స్పూర్తిగా భట్టి విక్రమార్క్ ప్రజలతో మమేకం అవుతూ తన పీపుల్స్ మార్చ్ యాత్ర కొనసాగిస్తున్నారు. మార్చి 16న ఆదిలాబాద్లోని పిప్పిరి గ్రామంలో ప్రారంభమైన ఈ పాదయాత్ర జూలై 2న ముగియనుంది. ఖమ్మంలో జరిగే ఈ సభకు రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. భట్టి పాదయాత్ర ద్వారా తెలంగాణ కాంగ్రెస్ కేడర్ లో జోష్ పెరిగింది. అప్పటి వరకు ఎవరికి వారుగా ఉన్న నేతలను భట్టి పాదయాత్ర ఒకే వేదిక మీదకు తీసుకొచ్చింది. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాల పైన భట్టి ప్రజల మధ్యనే ఉంటూ పోరాటం ప్రారంభించారు. పేద ప్రజల సమస్యల పైన ఫోకస్ చేసారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ.. పేద వర్గాలతో మమేకం అయ్యారు. అన్ని వర్గాల సమస్యలను తెలుసుకుని ముఖాముఖి మాట్లాడుతూ సభలు పెడుతూ.. ప్రజలతో నడుస్తూ భట్టి విక్రమార్క ప్రజలకు చేరువయ్యారు. పార్టీ నేతలతో భట్టికి ఉన్న సత్సంబంధాలతో అందరివాడుగా నిలిచారు.

భట్టి యాత్రలో నేతలంతా పాల్గొని సంఘీభావం ప్రకటించారు. పార్టీ జాతీయ నేతలు హాజరై మద్దతిచ్చారు. రాష్ట్రంలోని సమస్యలపైన ఎక్కడిక్కడ స్పందిస్తూ...కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే ప్రయోజనం ప్రజలకు వివరిస్తూ భట్టి తన యాత్ర సాగిస్తున్నారు. భట్టి ప్రజలతో మమేకం అవుతున్న తీరును రాహుల్ అభినందించారు. పార్టీ నాయకత్వం తోడుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. జాతీయ స్థాయిలోనూ భట్టి పాదయాత్ర గురించి ఆరా తీస్తున్నారు. భట్టి పాదయాత్ర చేసిన ప్రాంతాల్లో ఆ వెంటనే బీఆర్ఎస్ నేతలు పర్యటించటం.. భట్టికి స్థానికులు ఫిర్యాదు చేసిన అంశాల పరిష్కారినికి చొరవ తీసుకోవటం ద్వారా భట్టి యాత్ర ఆ పార్టీలో ఎంత కలవరపాటుకు గురి చేస్తుందనేది స్పష్టం అవుతోంది. పాదయాత్ర సమయంలోనే పార్టీలో నేతల చేరికల పైన భట్టి ప్రత్యేకంగా దృష్టి సారించారు. పొంగులేటి వంటి నేతలు భట్టిని కలిసి ముందుకు సాగాలని నిర్ణయించారు. జూలై 2న ఖమ్మంలో జరిగే సభకు రాహుల్ హాజరు కానున్నారు. దృఢ సంకల్పంతో ముందుకు దూసుకెళ్తున్న భట్టి విక్రమార్క పాదయాత్ర ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలకు స్పూర్తిగా మారుతోంది.

## సంపాదకీయం

### ఆ నియంత పిచ్చి పీక్స్ కు చేరిందా..

# ఇదెక్కడి కొత్త రూల్!

అమెరికా దాని మిత్ర దేశాలు ఐక్యరాజ్య సమితి తదితరాల ఆంక్షలను పట్టించుకోకుండా నిత్యం క్షిపణి ప్రయోగాలు అణ్వాయుధ పరీక్షలతో అమెరికా జపాన్ దక్షిణ కొరియా దేశాలకు ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ పక్కలో బల్లెంలా మారిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా దాని మిత్ర దేశాలతో ధూర్త (చెడ్డ) దేశంగా ముద్ర పడింది.. ఉత్తర కొరియా. ఈ దేశాల విమర్శలకు తగ్గట్టే ఉంది.. ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పరిపాలన. దేశంలో తన ప్రజలకు చిత్ర విచిత్రమైన రూల్స్ ను ప్రవేశపెడుతూ.. వాటిని ఎవరైనా పాటించకపోతే వారికి ఏకంగా ఉరి శిక్షతో పాటు కఠిన కారాగార శిక్షలను కిమ్ జోంగ్ ఉన్ విధిస్తున్నాడు. నియంత కిమ్ జోంగ్ ఉన్ పాలనలో అక్కడి చట్టాలను ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలు ఉంటాయో ఊహించుకోవడం కూడా కష్టమేనంటారు. చివరకు దేశ ప్రజలు మహిళలు పురుషులు ఎలాంటి హెయిర్ స్టైల్ ఉండాలో కూడా కిమ్ జోంగ్ ఉన్నే నిర్ణయించాడు. ఈ నిబంధనలు పాటించకుండా ఎవరైనా తమకు నచ్చినట్టు హెయిర్ స్టైల్ తో ఉంటే వారికి చావు తప్పదు. ఇలా చిత్ర విచిత్రమైన పనికిమాలిన నిబంధనలతో నియంతలకే నియంతనని అనిపించుకున్నాడు.. కిమ్. ఇప్పుడు ఇదే క్రమంలో మరో కొత్త రూల్ ను కిమ్ జోంగ్ ఉన్ అమల్లోకి తెచ్చాడు. పాశ్చాత్య దేశాల సినిమాలు సీరియళ్లు టీవీ షోలు చూస్తే కఠిన శిక్షలు విధిస్తామని తాజాగా ఉత్తర కొరియా ప్రభుత్వం ఆ దేశ ప్రజలను హెచ్చరించింది. ఈ క్రమంలో చిన్నవారు పెద్దవారు అనే తేడా ఉండదని తెలిపింది.. శిక్షల పరిమాణం కూడా తక్కువ ఉండదని హెచ్చరించింది. ఇప్పటికే ఉత్తర కొరియాలో ఇంటర్నెట్ టీవీ ఛానెళ్లు భావ ప్రకటన సోషల్ మీడియా వినియోగంపై కఠిన ఆంక్షలు ఉన్నాయి. ఇప్పుడు ఇక విదేశాలకు చెందిన ముఖ్యంగా దక్షిణ కొరియాకు చెందిన టీవీ సీరియళ్లు సినిమాలు టీవీ షోలు చూస్తే మరణశిక్ష విధిస్తామని ఉత్తర కొరియా తాజాగా దేశ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. హాలీవుడ్ సినిమాలు చూసేందుకు పిల్లలకు అనుమతి ఇస్తే తల్లిదండ్రులు కూడా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఈ విషయాన్ని రేడియో ఫ్రీ ఆసియా వెల్లడించింది. దేశంలోని పిల్లలు పాశ్చాత్య సినిమాలు టీవీ కార్యక్రమాలను చూస్తూ పట్టుబడితే తల్లిదండ్రులను శిక్షిస్తామని ఉత్తర కొరియా ప్రభుత్వం వార్నింగ్ ఇచ్చింది వారిని ఆరు నెలల పాలు లేబర్ క్యాంపులకు పంపడంతోపాటు పిల్లలకు ఐదేళ్లు జైలు శిక్ష విధిస్తామని పేర్కొంది. గతంలో పిల్లలు విదేశీ సినిమాలు చూస్తూ పట్టుబడితే తీవ్ర హెచ్చరికతో తల్లిదండ్రులు తప్పించుకునే వారు. అయితే ఇక నుంచి మాత్రం ఇలా హెచ్చరికలతో తప్పించుకునే అవకాశం ఉండదని తెలిపింది. పిల్లలను ప్రతిక్షణం తల్లిదండ్రులు చదివించాలని.. లేకపోతే వారు పెట్టుబడిదారులుగా యాంటీ సోషలిస్టులుగా మారతారని కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం చెబుతోంది. అలాగే ఎవరైనా దక్షిణ కొరియన్ లాగా కనిపించినా.. తల్లిదండ్రులు 6 నెలల పాటు జైలు శిక్షకు గురవుతారని హెచ్చరించింది.

గతేడాది ఇద్దరు టీనేజర్లు దక్షిణకొరియా అమెరికన్ సినిమాలు చూసినందుకు కిమ్ ప్రభుత్వం వారిని స్థానికుల ముందే ఉరితీసింది. 2020 నుంచి దక్షిణ కొరియన్ షోలపై అక్కడి నిషేధం ఉన్న సంగతి తెలిసిందే.

# అక్రమ లేఅవుట్లు.. సామాన్యులకు పాట్లు



ఆసిఫాబాద్ : ఈ చిత్రం ఇచ్చోడ మండలం దూబార్‌పేట లోనిది. మొన్నటిదాకా వ్యవసాయ భూమిగా ఉండేది. కొనుగోలు చేసిన వ్యాపారులు ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి బండలను నామమాత్రంగా తొలగించారు. ప్రస్తుతం ఆ వెంచర్లలోనే ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ చిత్రం తలమడుగు మండలం దేవాపూర్‌లోనిది. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉండటంతో భూముల ధరలకు అధిక డిమాండ్ ఉంది. తమకున్న పంట పొలాలను లేఅవుట్లు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. వీటికి పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతులు లేవు. పంచాయతీ సర్పంచితోపాటు కార్యదర్శులు నోటీసులు సైతం ఇచ్చారు. వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా తమపని తాము కానిస్తున్నారు. ఇక్కడ ఎకరం రూ.25 లక్షల వరకు కొంటున్నారు. ఇందులో రహదారులు, మురుగుకాలువలు పోనూ ప్లాట్లుగా మారిస్తే ఎకరం భూమిలో దాదాపు 15 ప్లాట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్క దాని ధర రూ.7 లక్షల చొప్పున విక్రయిస్తే రూ.1.05 కోట్లు వస్తుంది. అంటే రూ.80 లక్షలు లాభం వస్తుంది.

మొన్నటి దాకా పట్టణాల్లో జోరందుకున్న స్థిరాస్తి వ్యాపారం ప్రస్తుతం పల్లెలకు పాకింది. పట్టణాల్లో భారీగా ధరలు పలుకుతుండటం, స్థలాలు అంతగా లేకపోవడంతో వ్యాపారులు పల్లెలపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులను ఆనుకొని ఉన్న గ్రామాల్లో సాగు భూములను కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లు వేసి దందాను జోరుగా సాగిస్తున్నారు. పంచాయతీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన లేఅవుట్లు చేస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకొని ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, తలమడుగు, తాంసి, మావల, జైనథ్ మండలాలు ఉండటంతో భూములకు అధిక ధర పలుకుతోంది. అవసరాల దృష్ట్యా రైతులు సాగు భూములను అమ్ముకుంటున్నారు. కొనుగోలు చేసిన వ్యాపారులు భారీగా లాభం పొందేందుకు లేఅవుట్లు చేస్తున్నారు. పట్టణాల్లో లేఅవుట్లు లేకుండా అనుమతులు లేకుండా ఏ పని సాగదు. ఈ విషయాన్ని గ్రహించిన పలువురు వ్యాపారులు పల్లెల బాట పడుతున్నారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో లేఅవుట్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా ఉన్నట్లుగా చెప్పి స్థలాలు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి వ్యాపార సంస్థ పేరుపైకి రిజిస్ట్రేషన్లు కాకముందే హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా అమ్మకాలు చేస్తున్నారు. అంతేకాకుండా నకిలీ బ్రోచర్లు సృష్టించి అన్ని అనుమతులు ఉన్నట్లు నమ్మిస్తున్నారు. అధికారులు వీటిపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

**అనుమతి పొందడం ఇలా..** నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో లేఅవుట్ చేయాలంటే మొదట భూమి విలువలో మూడు శాతం రుసుము రెవెన్యూ శాఖకు చెల్లించి నాలా(వ్యవసాయేతర భూమి)గా మార్చుకోవాలి. తర్వాత డీటీసీపీ నుంచి అనుమతులు పొంది లేఅవుట్‌లు వేసుకోవాలి.

ప్రజావసరాల నిమిత్తం లేఅవుట్‌లో 30 అడుగుల రహదారులు, వీధి దీపాల ఏర్పాటు, నీటి ట్యాంకు, మురుగు కాలువల నిర్మాణాలు నిర్వాహకులే చేపట్టాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విరుద్ధంగా లేఅవుట్లు చేశారు.

**అక్రమ లేఅవుట్లపై చర్యలు : – శ్రీనివాస్, డీపీవో, ఆదిలాబాద్**

జిల్లాలోని ఆయా మండలాల్లో పంచాయతీల అనుమతులు లేకుండా వెలసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం. పంచాయతీ పరిధిలో ఎవరు కూడా ప్లాట్లు కొని మోసపోవద్దు నాలా అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. ఇప్పటికే అక్రమ లేఅవుట్లను గుర్తించాం. త్వరలో వాటిపై చర్యలు తీసుకుంటాం. కొనుగోలు చేసిన తర్వాత నాలా అనుమతి ఇవ్వడం సాధ్యం కాదు.

# నిధులు లేక.. నీరందక

ఆసిఫాబాద్ : జిల్లాలో సుమారుగా లక్ష ఎకరాల భూములకు సాగునీరందించే జలాశయాలు ఉన్నాయి. కాలువలు సక్రమంగా లేక నిండా నీరున్నా యాసంగిలో పంటలు ఎండే పరిస్థితి నెలకొంది. నిధుల లేమితో కాలువల ఆధునికీకరణ, పూడికతీత పనులేవీ సాగకపోవడం వల్ల ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రైతులే తలాకొంత డబ్బులు పోగు చేసుకుని కాలువల్లో పూడిక తీసుకుంటూ నీరు పంటలకు చేరేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శిథిలమైన కాలువలు, బిగుసుకుపోయిన షట్టర్లు, మూసుకుపోయిన తూములతో పూర్తయిన ప్రాజెక్టులు రైతులకు రిక్తహస్తాన్ని మిగుల్చుతుండగా, అసంపూర్తి పనులతో నీళ్లు రాక మిగతా ప్రాజెక్టులు సైతం అన్నదాతకు కన్నీరే మిగిలిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా తగినన్ని నిధులు కేటాయించి, ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని కర్షకులు కోరుతున్నారు. జిల్లాలో 1.02 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన కుమురం భీం, వట్టివాగు, జగన్నాథ్‌పూర్, పీపీరావు, చెలిమెల మధ్య తరహా సాగు నీటి ప్రాజెక్టులున్నాయి. ఇందులో ఒక్కటీ నిర్ణీత లక్ష్యం మేర భూములకు సాగు నీరందించడం లేదు. ప్రధాన కాలువలకు గండ్లు పడి నీటి విడుదలను నిలిపివేయడం, నిధులు లేక భూములు సేకరించక, పిల్ల, పంపిణీ కాలువలు నిర్మించకపోవడం వల్ల జలాశయంలో నీరున్నా పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు, చిన్నతరహా సాటు నీటి ప్రాజెక్టుల కోసం సైతం అధికారులు బడ్జెట్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో తిర్యాణి మండలంలోని చెలిమెల, బెజ్జూర్ మండలంలోని బొక్కివాగు, కౌటాల మండలంలోని అర్కగూడ, కెరమెరి మండలంలోని కేస్లగూడతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లోని చెరువులు, కాలువల మరమ్మతుల కోసం రూ.48 కోట్లతో ప్రతిపాదనలు నీటిపారుదలశాఖ అధికారులు సిద్ధం చేశారు. నిధులు విడుదలై, పనులు సకాలంలో పూర్తయితే అన్నదాతల సాగునీటి ఇబ్బందులు తీరినట్లే.

**దశాబ్దాల నుంచి నిర్మాణంలోనే...** కాగజ్‌నగర్ మండలంలో పెదవాగుపై 2005లో ప్రారంభమైన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు నేటికీ నిర్మాణ దశలోనే ఉంది. 19 క్రస్ట్‌గేట్లను మాత్రమే అమర్చారు. 29 కిలోమీటర్ల ప్రధాన కాలువ ఇప్పటి వరకు 27 కిలోమీటర్ల మేర పూర్తయ్యింది. 35 కిలోమీటర్ల మేర పంపిణీ కాలువలను నిర్మించాల్సి ఉండగా.. 3 మాత్రమే పూర్తయ్యాయి. 101 ఎకరాల భూమి ఇంకా సేకరించాల్సి ఉంది.

**పీపీరావు.. నీళ్లు రావు..** దహెగాం మండలంలోని పీపీరావు జలాశయం 11 వేల ఎకరాలకు నీరందించేంది. 2003లో రూ.100 కోట్ల వ్యయంతో పూర్తయిన ఈ ప్రాజెక్టు కాలువలు అనేక చోట్ల నామరూపాల్లేకుండా పోయాయి. ప్రస్తుతం 1000 ఎకరాలకు మాత్రమే అతికష్టం మీద నీళ్లు అందుతున్నాయి. కాలువల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

**కుమురం భీం.. ఆయకట్టు రైతుల నిర్వేదం**

45 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన కుమురం భీం జలాశయం ఆరు నెలల నుంచి ఎకరం పంట పొలానికి సైతం నీరందించడం లేదు. ప్రధాన కాలువకు వాంకిడి సమీపంలో గత ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు రెండుగండ్లు పడగా నేటికి మరమ్మతులు చేయలేదు. ఈ కారణంగా నీటి విడుదలను నిలిపివేశారు. 77 కిలోమీటర్ల వరకు ఎడమ ప్రధాన కాలువ నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 74 కిలోమీటర్లు పూర్తయ్యింది. కుడికాలువ ఏడు కిలోమీటర్ల పూర్తయినా ఆదిలోనే కూలిపోవడంతో చుక్కనీరు రావడం లేదు.

**సార్థక నామధేయం.. వట్టివాగు**

శిథిలమైన కాలువలు, అడుగడుగునా లీకేజీలు, విరిగిన షటర్‌లకు వట్టివాగు చిరునామాగా మారింది వట్టివాగు. 1977లో చేపట్టిన ప్రాజెక్టు పనులు 1998లో పూర్తయ్యాయి. 25 వేల ఆయకట్టు కలిగిన ఈ జలాశయం ఎన్నడూ 1000 ఎకరాలకు మించి తడపడం లేదు. ఇవి సైతం రైతులు స్వయంగా పూడిక తీసుకుంటూ అతికష్టం మీద పంటలకు నీరందిస్తున్నారు. గతేడాది బడ్జెట్‌లో సైతం ఈ ప్రాజెక్టుకు నిధులేమి కేటాయించలేదు.

# పట్టుతప్పితే ప్రాణాలకే ప్రమాదం

ఆసిఫాబాద్ : ఆదిలాబాద్ పట్టణంలో రహదారుల పక్కన నాలాలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాలు అదుపు తప్పినా, జారినా నాలాలో పడిపోయే పరిస్థితులున్నాయి. హైదరాబాద్‌లో గతంలో నాలాల్లో పడి పలువురు గల్లంతైన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నాలాలకు రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాలాల్లో పడి ఏవైనా ప్రమాదాలు జరిగినా సంబంధిత పురపాలక అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువలు, నాలాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**వర్షాలతో పొంచి ఉన్న ముప్పు**

జిల్లా కేంద్రంలో కొన్నిచోట్ల రోడ్డు పక్కనున్న పాత నాలాలకు ఎలాంటి రక్షణ చర్యలు లేవు. ఖుర్షీదపూర్‌లో రెండుచోట్ల, శాంతినగర్‌లో రెండుచోట్ల, తాటిగూడలో నాలాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలు



పడితే ఈ నాలాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. పాదచారులు ఎవరైనా పట్టుతప్పినా, వాహనాలు అదుపుకాకపోయినా అందులో పడిపోతారు. పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పడిపోతే గల్లంతయ్యే అవకాశాలున్నాయి. అక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు

# సాంకేతిక పొరపాటు.. పన్ను పోటు

ఆసిఫాబాద్ :మావల గ్రామ పంచాయతీ నుంచి పట్టణ పరిధిలోకి వచ్చిన ప్రాంతంలో షాప్ కేటగిరీకి చెందిన ఓ భవనాన్ని ఆస్తి పన్ను అసెస్‌మెంట్ చేసి ఆన్‌లైన్ చేస్తే దాదాపు రూ.10వేలకు పైగా వచ్చింది. రూ.2 వేల లోపే రావాల్సిన పన్ను ఎక్కువగా నమోదు కావడంతో అధికారులు అవాక్కయ్యారు. ఇది పట్టణంలో విలీనమైన బెల్లూరి ప్రాంతం. ఇక్కడ ఓ గుడిసెకు బల్దియా రెవెన్యూ సిబ్బంది కొత్తగా ఆస్తి పన్ను మదింపు చేసి ఆన్‌లైన్ చేశారు. వాస్తవానికి ఆ గుడిసెకు రూ.600–700 పన్ను రావాలి. కానీ రూ.4 వేలకు పైగా రావడంతో అంత పెద్ద మొత్తంలో ఎలా వచ్చిందని సిబ్బందే ఆశ్చర్యపోయారు. పూరి గడిసెకు రూ.4 వేలు.. ఆర్‌సీసీ భవనానికి రూ.10 వేలు.. షాప్ బిల్డింగ్ అయితే రూ.15 వేలు.. ఇవన్నీ ఆస్తి పన్నులంటే ఎవరైనా అదిరిపడతారు. ఇంటి యజమాని చేతిలో బిల్లు పెడితే కంగుతింటారు. అయితే ఈ వ్యవహారం అక్కడిదాకా వెళ్లలేదు. మావల పంచాయతీ నుంచి విలీనమైన కాలనీలు, బెల్లూరి పరిధిలో ఆస్తి పన్నును మదింపు చేసి ఆన్‌లైన్ చేసే సమయంలోనే జరిగిన పొరపాటని బల్దియా అధికారులు గుర్తించారు. సాంకేతిక తప్పిదాన్ని సవరించి, ఎక్కువగా వచ్చిన ఆస్తి పన్ను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) లేఖ రాశారు.

**భువన్ సర్వేతో వెలుగులోకి..**



ఆదిలాబాద్ పురపాలికలో 2018లో సమీప పంచాయతీలు, కాలనీలను విలీనం చేశారు. అందులో అనుకుంట, రాంపూర్ పంచాయతీలు, బెల్లూరి అనుబంధ గ్రామం పూర్తిగా విలీనం కాగా.. మావల, బట్టిసావర్గాం గ్రామాలు తప్ప వాటి పరిధిలోకి వచ్చే కాలనీలన్నీ పట్టణంలో కలిశాయి. విలీన ప్రాంతాలకు సంబంధించిన రికార్డులన్నింటినీ బల్దియా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి మూడేళ్ల వరకు విలీన ప్రాంతాల ఆస్తి పన్నులు పాతవాటినే వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంతో గడువు ముగియనుంది. వచ్చే సంవత్సరం నుంచి కొత్తగా మదింపు చేసిన ఆస్తిపన్నులు అమల్లోకి రానున్నాయి. దీంతో బల్దియా అధికారులు భువన్ సర్వే చేస్తున్నారు. ఇంటి కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో అనుకుంట, రాంపూర్, బట్టిసావర్గాం పరిధిలో ఇళ్లకు ఆస్తిపన్ను మదింపు సరిగానే జరిగింది. మావల, బెల్లూరి ప్రాంతాల్లోని ఆస్తులకు వాస్తవంగా రావాల్సిన పన్ను కన్నా ఎక్కువగా నమోదు అవుతుండటాన్ని గుర్తించారు.

**విలీనానికి ముందే సమస్య**

ఆస్తిపన్ను మదింపులో ఇంటి నిర్మాణ రకం, విస్తీర్ణం, నివాస, నివాసేతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. పట్టణంలో జోన్ల వారీగా నిర్ణయించిన ధరలను క్యాపిటల్ విలువతో లెక్కించగా ఆస్తి పన్ను వస్తుంది. ఈ క్యాపిటల్ వ్యాల్యూ సాధారణంగా 0.12 శాతంగా ఉంటుంది. కానీ మావల, బెల్లూరిలో అది 0.70గా ఉంది. ఈ కారణంగానే ఆ ప్రాంతాల్లో ఆస్తి పన్ను అయిదారు రెట్లు అధికంగా వస్తోంది. పట్టణంలో విలీనం కాకముందే అంటే 2018కి పూర్వమే ఆ పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో క్యాపిటల్ విలువను తప్పుగా నమోదు చేశారు. అక్కడ ఈ విధానం అమలు కాలేదు. ఆన్‌లైన్‌లో జరిగిన పొరపాటును సవరించకుండానే విలీన ప్రక్రియ ముగియడంతో మూడేళ్ల తర్వాత ఈ సమస్య బయటపడింది.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం : – ఎ.శైలజ, పురపాలక కమిషనర్**

పట్టణంలో విలీనమైన మావల, బెల్లూరిలో క్యాపిటల్ వాల్యూ ఎక్కువగా నమోదు కావడంతో ఆస్తిపన్ను భారీగా వస్తోంది. గతంలో ఆన్‌లైన్‌లో జరిగిన పొరపాటును గుర్తించాం. దాన్ని సవరించాలని కోరుతూ కౌన్సిల్ ఆమోదంతో సీడీఎంఏకు లేఖ రాశాం.

# అడుగడుగునా ఆనందం.. పక్షులతో మమేకం

జన్నారం : కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో సాగిన బర్డ్ వాచ్ అడుగడుగునా పక్షిప్రేమికులకు ఆనందాన్నిచ్చింది. అటవీ ప్రాంతంలోనే బసచేసిన పక్షిప్రేమికులు రాత్రి 11 గంటల వరకు చలి మంటలు కాచుకుంటూ కబుర్లతో గడిపారు. ఉదయం 5 గంటలకే ప్రారంభమైన బర్డ్‌వాచర్లకు కనువిందు చేసే పక్షులు తారసపడ్డాయి. బైసన్‌కుంటలో నీటిపై తేలియాడే పక్షులు, నీటిలో నిదానంగా ఈదే బాతులు కెమెరాలకు చిక్కాయి. దిల్లీ, హైదరాబాద్, రాజమండ్రి, వరంగల్, మంచిర్యాల, జగిత్యాల పట్టణాలకు చెందిన పక్షి ప్రేమికులు చక్కని అనుభూతిని పొందారు. అతి తక్కువ ఫీజుతో కొత్త కొత్త పక్షులను చూసే అదృష్టాన్ని పొందామని కొందరు హర్షం వ్యక్తం చేశారు. శనివారం గనిశెట్టికుంట, బైసన్‌కుంట వద్ద వేర్వేరుగా బస చేసిన రెండు బృందాల సభ్యులందరిని ఆదివారం ఒక్కచోటికి చేర్చారు. కొందరు వారి అనుభవాలను అధికారులతో పంచుకున్నారు. మరోసారి బర్డ్‌ఫెస్ట్‌ను నిర్వహించాలని మరికొందరు సూచించారు. అనంతరం అధికారులు, పక్షిప్రేమికులు అంతా కలిసి గ్రూపు ఫొటోలు దిగారు. అక్కడి నుంచి మధ్యాహ్నం స్థానిక అటవీశాఖ అతిథి గృహం వద్దకు చేరుకొని మధ్యాహ్న భోజనం అనంతరం ఎవరి గమ్యస్థానాలకు వారు వెళ్లిపోయారు.

**ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: పీసీసీఎఫ్**

ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అటవీశాఖ ప్రధాన ముఖ్య కన్జర్వేటర్(పీసీసీఎఫ్) శోభ అన్నారు. బర్డ్ వాచ్ ఫెస్ట్ ముగింపు సమావేశానికి హాజరైన ఆమె కవ్వాల్ అటవీ ప్రాంతంలోని బైసన్‌కుంట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పక్షిప్రేమికులను ఉద్దేశించి మాట్లాడారు. అందమైన పక్షులకు కవ్వాల్ నిలయంగా మారిందని అన్నారు. బీట్ అధికారి స్థాయి నుంచి జిల్లా అటవీ అధికారి వరకు ప్రతి ఒక్కరి కృషి వల్లనే కవ్వాల్ మంచి స్థాయిలో ఉందని అన్నారు. జన్నారం ఎఫ్‌డీఓ మాధవరావును ప్రత్యేకంగా అభినందించారు. కవ్వాల్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, ఆదిలాబాద్ చీఫ్ కన్జర్వేటర్ రామలింగం, మంచిర్యాల డీఎఫ్ఓ శివానిడొంగ్రే, ఇంధన్‌పల్లి, తాళ్లపేట రేంజి అధికారులు హాఫీసోద్దీన్, రత్నాకర్‌రావు, బీట్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# కాల్వల 'నిండా నిర్లక్ష్యమే'..!

జయశంకర్ : వర్షాలు ఆలస్యమయ్యాయి.. లేదంటే, ఇదివరకే వానాకాలం సాగు పనులు ఊపందుకునేవి.. వర్షాల కోసం ఎదురుచూస్తూనే రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో పంటల సాగుకు ప్రధానంగా చెరువులు, బోరు బావులు, ఎస్సారెస్పీ కాల్వల ఆధారంగా సాగవుతున్నాయి. ఎస్సారెస్పీ కాల్వలు రేగొండ, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో ఉన్నాయి. ఆయా మండలాల రైతులు వానాకాలం, యాసంగిలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా వచ్చే నీటితో చెరువులు నింపి సాగునీరు అందిస్తారు. కానీ, ఆయా మండలాల పరిధిలోని ఎస్సారెస్పీ 38 డీబీఎం, ఎల్ 44 ఉప కాల్వలు అధ్వానంగా మారాయి. ప్రధాన, ఉప కాల్వలు మరమ్మతులకు గురి కావడం, పిచ్చిమొక్కలు పెరగడంతో సాగునీరు సాఫీగా పారడం లేదు. డీబీఎం 38 కాల్వ దాదాపు జిల్లాలో 30 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయి దర్శనమిస్తోంది. అలాగే చాలా చోట్ల సీసీ లైనింగ్ దెబ్బతింది. రేగొండ, చిట్యాల ప్రాంతంలో కాల్వ ధ్వంసమైంది. కొన్నిచోట్ల మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారుతున్నాయి. దీని ద్వారా గండ్లు పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలుచోట్ల కాల్వలు పగుళ్లు బారాయి. చెట్ల వేర్లతో కాల్వలు దెబ్బతింటున్నాయి. కాల్వల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, నిలిచిన మట్టిని తొలగించేందుకు ఈ సారి ఉపాధి హామీ పనులు చేశారు.



పలుచోట్ల ఉపాధి కూలీలతో పిచ్చిమొక్కలు తొలగించారు. కాల్వలను శుభ్రం చేశారు. అయితే కొన్ని ప్రాంతాలకే పరిమితం చేశారు. పూర్తి స్థాయిలో చేపడితే కూలీలకు పని దొరికేది.. కాల్వ శుభ్రమయ్యేది. అధికారులు దృష్టి సారించలేకపోయారు. అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ధ్వంసమైన లైనింగ్ నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టి, కాల్వల్లో పూడిక తీసి, పిచ్చి మొక్కలు తొలగించి సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలు పెరిగాయ్..

–ఆగారెడ్డి, రైతు, రంగయ్యపల్లి, రేగొండ చిట్యాల

వర్షాలు కురవడం లేదు. బోరుబావుల్లో సరిపడా నీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఎస్సారెస్పీ నీరు ఈ సారి ఎక్కువగా వినియోగించుకునే అవకాశం ఉంది. కానీ, కాలువలు సరిగా లేవు. పిచ్చిమొక్కలు పెరిగాయి.. కాలువల పరిస్థితి బాగా లేదు. శుభ్రం చేసి నీరందించాలి.

మరమ్మతులు చేపట్టాలి

– కొఠారి శ్రీనివాసరావు, రైతు, గుంటూరుపల్లి, చిట్యాల మండలం

ఎస్సారెస్పీ కాల్వల్లో చెత్తాచెదారం పోగవుతోంది. చెట్లు మొలిచాయి.. పూడిక పేరుకుపోతోంది. కాల్వలను శుభ్రం చేయించాలి. పలుచోట్ల లైనింగ్ దెబ్బతింది. వాటికి మరమ్మతులు చేయించాలి.

పనులు చేయిస్తాం

–గిరిధర్, డీఈ, నీటిపారుదలశాఖఎస్సారెస్పీ కాల్వలను శుభ్రం చేయిస్తాం. ఇదివరకే కొన్నిచోట్ల ఉపాధి పనుల కింద కాల్వల్లో తుప్పలను, చెట్లను తొలగించాం. పూడిక కూడా తీయించాం. ఈఅండ్ఎం కింద పలుచోట్ల కాలువలు, షట్టర్లను మరమ్మతులు చేయించాం. మిగతా అవసరమైన ప్రాంతాల్లో పనులు చేయిస్తాం.

# ఆక్రమణలు.. అనర్థాలు

కోరుట్ల: అధికారులు, పాలకులకు ముందుచూపు లేకపోవడం.. గొలుసుకట్టు కాలువలు ఆక్రమణకు గురికావడం.. మత్తడి కాలువలను అభివృద్ధి పేరిట సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలుగా మార్చడంతో ఏటా లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. కోరుట్ల పట్టణంలో కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఆదర్శనగర్, ప్రకాశంరోడ్, ఝాన్సీరోడ్, తాళ్ల చెరువు కింది ప్రాంతాల్లోని కాలనీలను వరదలు ముంచెత్తుతున్నాయి. రోడ్లపై రోజుల తరబడి వరద నీరు ప్రవహించడంతో పాటు ఇళ్ల చుట్టు నీరు నిలిచి ప్రజలు బయటకు రాని దుస్థితి నెలకొంటుంది.

కనుమరుగు..!

మద్దుల చెరువు మత్తడి కింద సహజ సిద్ధంగా ఏర్పడిన కాలువ ఉండేవి. అది సుమారు 15 అడుగుల మేర వెడల్పుతో కూడిన కాలువ పట్టా భూమిలో ఉందని భూయజమానులు, రియల్ఎస్టేట్ వ్యాపారులు సుమారు 15 ఏళ్ల కాలువను ఆక్రమించి 3, 4 అడుగుల కాలువగా మార్చారు. దాన్ని మున్సిపల్ అధికారులు మురుగు కాలువగా నిర్మించారు. పలుచోట్ల కాలువను ఆక్రమించి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో వరదనీరు ఆ మురుగు కాలువ పైనుంచి పొంగి రోడ్లపైకి చేరుతుంది. అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్ కింది ప్రాంతాలు పూర్తిగా జలమయమవుతుండగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురుగు కాలువ విస్తీర్ణం పెంచేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో అలాగే వదిలేస్తున్నారు.

ఆక్రమణలే అసలు సమస్య

నిజామాబాద్ జిల్లా కొనాపూర్ రాళ్లవాగు ప్రవాహం నీరు మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ శివారులోని పెద్దవాగు నుంచి మాన్పూర్ కాలువ ద్వారా ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువుకు నీరు వచ్చి మొదటగా చేరుతుంది. అక్కడి నుంచి కోరుట్ల పట్టణంలోని పీతిరికుంట, కంచరకుంట, మద్దుల చెరువు, లస్కగౌడ్‌కుంట, బొల్లికుంట, అయిలాపూర్‌లోని పాడిచెరువు, పెద్దచెరువులను కలుపుతూ గతంలో గొలుసుకట్టు చెరువులు, కాలువలు ఉండేవి. మరోవైపు స్తంభాల చెరువు మత్తడి దూకిన నీరు షరాబుకుంట నుంచి తాళ్లచెరువులో చేరి ఎక్కువైన నీరు మత్తడి దూకి కాలువ ద్వారా కోరుట్ల ఫుల్‌వాగ్‌లో కలుస్తుండేది. స్తంభాల చెరువు నిండిన తర్వాత దాని కిందున్న మిగతా చెరువులను నింపేందుకు ప్రత్యేక కాలువలు, తూములు, చెరువులో ఎక్కువైన నీరు కింది ప్రాంతానికి వెళ్లేందుకు మత్తడిలు ఉండేవి. కుంటలు, కాలువలు ఆక్రమణకు గురికావడం, ఉన్నవి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏటా వర్షాకాలంలో కాలువలు కోతకు గురవుతూ వరద నీరు ఎటు వెళ్లాలో తెలియక రోడ్లను, కాలనీలను ముంచెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. స్తంభాల చెరువు నుంచి కంచరకుంటకు వచ్చే కాలువ బీలాల్‌పుర, ఏసుకోనిగుట్ట వద్ద దెబ్బతిని తరచుగా కోతకు గురవుతుంది. కంచరకుంట నుంచి అయిలాపూర్ పాడిచెరువులోకి వెళ్లే కాలువలను సుమారు 20 ఏళ్ల క్రితం రైతులు ఆక్రమించుకుని మామిడితోటలు, పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో కంచరకుంట మత్తడి దూకడంతో ఉద్ధృతంగా నీరుపారి ఆదర్శనగర్ పూర్తిగా జలమయవుతుంది.

మత్తడి కిందే రోడ్డు నిర్మాణం

తాళ్ల చెరువులో ఎక్కువైన నీరు బయటకు వెళ్లేందుకు మత్తడి ఉంది. మత్తడి దూకిన నీరు కాలువ ద్వారా వెళ్లి ఫుల్‌వాగులో నేరుగా కలుస్తుండేది. అభివృద్ధి పేరా సుమారు 12 అడుగుల కాలువను 3 అడుగుల వెడల్పుతో కూడిన మురుగు కాలువగా మార్చారు. మిగతా కాలువను చదును చేసి సిమెంట్‌రోడ్‌గా అభివృద్ధి చేశారు. దీంతో ఏటా మత్తడి దూకిన వరద నీరంతా సిమెంట్ రోడ్లపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. తాళ్ల చెరువుకు తూంలు ఉన్న వాటి నుంచి నీటిని కిందికి వదలడం లేదు. చెరువులోకి నీటి ప్రవాహం ఎక్కువైనప్పుడు వరద నీరు మత్తడి పైనుంచి భారీగా కిందికి పారుతుండగా కింది ప్రాంతాల కాలనీవాసులు వరద నీటితో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

# చెరువు శిఖం.. ఆక్రమణల పర్వం!



మహబూబాబాద్ : జిల్లాలో 1622 చెరువులున్నాయి. వీటి ద్వారా 98,699 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. భూములకు అధిక ధరలు పలుకుతుండడంతో.. అక్రమార్కుల ఆక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. సుమారు 100 గ్రామాల్లోని చెరువుల, కుంటల శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. తొలుత బావుల తవ్వకాలు చేపట్టి క్రమంగా ఆ భూముల్లో పాగా వేస్తున్నారు. కొన్ని చోట్లనైతే కుంటలున్నట్లు రికార్డుల్లో సమాచారం ఉంటుంది. కాని క్షేత్రస్థాయిలోకి వెళ్లి చూస్తే వాటి ఆనవాళ్లు కూడా కానరాని పరిస్థితులున్నాయి. తప్పుడు సమాచారాలతో సర్వే నెంబర్ల పేరిటహద్దులు నిర్ణయించుకుని కొందరు తమ దందాను కొనసాగిస్తున్నారు. కొందరు మత్తళ్లను తొలగించి వాటిలో నీరు నిల్వ లేకుండా చేస్తూ ఎఫ్‌టీఎల్ పరిధిలో సాగు చేపడుతున్నారు. పట్టణంలో ఉన్న చెరువు ఎఫ్‌టీఎల్ భూములు కూడా అక్రమార్కుల చేతుల్లో ఉన్నాయి. వాటిల్లో కట్టడాలు కూడా చేపట్టారు. పెద్ద ఎత్తును కబ్జాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉపాధిపై ప్రభావం చెరువుల, కుంటల ఆక్రమణలతో భవిష్యత్తులో తమ ఉపాధిపై దెబ్బపడే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమంగా వాటి విస్తీర్ణాలు తగ్గుతుండడంతో సర్కారు తమ ప్రయోజనం కోరుతూ వందశాతం రాయితీతో అందిస్తున్న చేపపిల్లల పెంపకానికి ఆవరోధం ఏర్పడనున్నట్లు వారు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటూ పలుమార్లు జిల్లా అధికారులకు అర్జీ పెట్టుకున్నా ఎలాంటి మార్పు కనిపించడం లేదంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌తో కనిపిస్తున్న ఇది కురవి మండలం నేరడ పెద్ద చెరువు. సుమారు 500 ఎకరాల విస్తీర్ణం కలిగిన దీని కింద 650 ఎకరాల ఆయకట్టు కలదు. శిఖం భూమిలో కొందరు వ్యవసాయ బావులను తవ్వి ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఒకరు శిఖం భూమిని చదును చేసినట్లు తెలిసింది. అధికారులు పట్టించుకోకుంటే మరిన్ని బావుల తవ్వకాలు చేపట్టే ప్రమాదం ఉందని ఆయకట్టు ప్రజలు వాపోతున్నారు.

నెల్లికుదురులోని పెద్ద చెరువు ఇది. 310 ఎకరాల విస్తీర్ణం కలదు. సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. ఈ చెరువుకు సంబంధించిన 20 ఎకరాల భూమికి ఆక్రమణకు గురైంది. శిఖం సమీపంలోనే పట్టాభూములున్నాయి. కొందరు వ్యక్తులు చెరువు శిఖం భూమిని ఆక్రమించుకొని రాళ్లు పాతారు. అధికారుల పట్టించుకోకపోవడంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో భవిష్యత్తులో తమ ఉపాధిపై గండిపడే అవకాశాలున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగానికి విన్నవిస్తే 'మాములు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై నీటిపారుదలశాఖ ఏఈ కిషన్‌నాయక్ మాట్లాడుతూ ఆక్రమణకు గురైనట్లు తనకు సమాచారం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామ పెద్ద చెరువు 368 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. దీనికి ఆనుకొని గ్రానైట్ క్వారీలున్నాయి. ఇవి ఎఫ్‌టీఎల్ హద్దులు దాటాయి. చిన్న రాళ్లు, వ్యర్థాలను చెరువులోనే వేస్తున్నారు. వరద కాలువకు రాళ్లు అడ్డుగా వేయడంతో జలకళ సంతరించుకోవడం లేదు. వారి ఆగడాలతో సుమారు 100 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి ఆక్రమణకు గురైనట్లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయి తరలింపు కోసం చెరువు శిఖంలోనే రోడ్డు వేసుకున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌లకు వినియోగించే రసాయన పౌడర్లు నీటిలో కలుషితమవుతుండడంతో చేపలు మృతి చెందుతున్నాయి. మత్స్యకారులు ఠాణాలో ఫిర్యాదు చేస్తే క్వారీల నిర్వాహకులు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆక్రమణకు గురవుతున్న చెరువును పరిరక్షించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మత్స్యకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# భూసార పరీక్షలేవి?




ములుగు : రైతు సాగు చేయాలంటే భూ సార పరీక్షలు ముఖ్యం. వాటి ఆధారంగా వివిధ పంటలు సాగు చేసి సరైన మోతాదులో ఎరువులు వాడి మెరుగైన దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. కొత్త జిల్లాల వ్యవస్థ ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వం భూసార పరీక్షా కేంద్రాలపై దృష్టి సారించడం లేదు. భూముల స్వభావానికి అనుగుణంగా ఎరువులు నిర్దేశించిన మోతాదులో వాడాలని శాస్త్రవేత్తలు సూచనలు చేస్తున్నప్పటికీ పరీక్షలు చేసిన దాఖలాలు లేవు. ఈ సారి కూడా పరీక్షలు లేకుండానే సాగు ప్రారంభమవుతోంది. భూమిలో ఎలాంటి పోషకాలున్నాయి? ఏయే పంటలు సాగు చేయాలో తెలియని పరిస్థితి.

మూలనపడిన కేంద్రాలు

భూసార పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేసిన మినీ పరీక్షా కేంద్రాలు ఎప్పుడో మూలనపడ్డాయి. లక్ష్యం నెరవేరకుండానే మరుగునపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం చొరవతో సుమారు ఆరేళ్ల కింద మండలాల వారీగా ఉన్న వ్యవసాయ శాఖ పరిధిలోని క్లస్టర్‌లను పరిగణనలోకి తీసుకొని మినీ భూ సార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ములుగు జిల్లాలోని 31 వ్యవసాయ క్లస్టర్‌లలో వాటిని ఏర్పాటు చేశారు. యంత్ర పరికరాలతో పాటు రసాయనాలను కూడా అందించారు. తాత్కాలిక వసతిలో భాగంగా ఆయా క్లస్టర్ పరిధిలోని పంచాయతీ కార్యాలయాల్లో చిన్న గదిని సమకూర్చి పరికరాలను ఏర్పాటు చేశారు. రసాయనాలు ఉన్నంత మేరకు ఆ ఏడాది మాత్రమే పని చేశాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి వాటి నిర్వహణ బాధ్యతలను చూడాల్సిన అవసరం ఉండగా గాలికి వదిలేసింది. సుమారు ఆరేళ్ల నుంచి వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. యంత్ర పరికరాలను రైతు వేదికల్లోకి మార్చి ఉపయోగంలోకి తీసుకురావాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అమలు కావడం లేదు.

వరంగల్‌కు వెళ్లాల్సిందే..

పంటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు తమ భూముల్లోని పోషకాలను తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సిందే. వరంగల్‌లోని భూ సార పరీక్షా కేంద్రాలకు నమూనాలను పంపించినా వాటి ఫలితాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అందుబాటులో లేక చాలా మంది రైతులు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ వ్యవసాయ అధికారుల చొరవతో మట్టి నమూనాలు సేకరించినా వాటి ఫలితాల కోసం ఎదురు చూపులతోనే కాలం గడిచిపోతోంది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు ఫలితాలు వస్తాయనే నమ్మకం లేదు.

జిల్లాకో కేంద్రం అవసరం

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక సాగు చేయాలనుకునే రైతుల అవసరాల కోసం జిల్లాకు ఒక భూసార పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాల వారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు అందుబాటులో ఉంటాయి. వేసవిలోనే మట్టి నమూనాలను రైతులే నేరుగా తీసుకొచ్చి పరీక్షలు చేయించుకునే అవకాశాలున్నాయి.

జిల్లాలో మొత్తం మండలాలు: 9
వ్యవసాయ క్లస్టర్లు: 31
మొత్తం రైతుల సంఖ్య: 76,692
సాగు విస్తీర్ణం: 67,700 ఎకరాలు
పంటలు: వరి, పత్తి, మిరప, వేరుసెనగ, మొక్కజొన్న, పెసర, మినుము, కూరగాయలు

# దాతల సాయంతో మరమ్మతులు

జయశంకర్ : గోవిందరావుపేట మండలంలోని లక్నవరం జలాశయం తూముల షట్టర్ల మరమ్మతులను కొంత మంది రైతులు దాతల నుంచి రూ.లక్షకు పైగా విరాళాలు సేకరించి మరమ్మతులు చేయించారు. జలాశయం నుంచి నీటిని విడుదల చేయడానికి మూడు తూములు, వాటికి తొమ్మిది షట్టర్లు ఉన్నాయి. నీటి లభ్యతను బట్టి ఆయా షట్టర్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తుంటారు. నీటి పారుదలశాఖ అధికారులు ఇటీవల రబీ సీజన్ తర్వాత షట్టర్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. అయితే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి అనుమతులు లభించిన తర్వాత మరమ్మతులు చేయాలంటే సమయం సరిపోదని, ఈలోగా వర్షం కురిస్తే పనులు చేయడం సాధ్యం కాదని భావించారు. ఇదే విషయాన్ని స్థానిక రైతులకు చెప్పారు. దీంతో మాజీ సర్పంచి భూక్యా దేవా నాయక్ ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు మాచినేని సాంబశివరావు, మాచినేని రాజారావు, కొమ్మూరి శివరాం, తలసిల రాంబాబు, ఆళ్ల వీరయ్య, తుంగపాటి మధు, బండి సురేశ్ తదితరులు ముందుకొచ్చి స్థానిక గోవిందరావుపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర జనరల్ ఇంజినీరింగ్ వర్క్స్ యజమాని పెందుర్తి బాబ్జిని సహకారం అందించాలని కోరారు. ఆయన స్పందించి తన సిబ్బందిని పంపించి నాలుగు రోజుల పాటు మరమ్మతులు చేయించారు. వర్షాలు పడకముందే పనులను పూర్తి చేశారు. రైతు ప్రతినిధులకు నీటిపారుదలశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. జలాశయం తూముల లోపల గోడలకు అమర్చిన కొన్ని రాళ్లు ఊడి పడిపోయాయని, నీటిపారుదలశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సకాలంలో మరమ్మతులు చేయించి తూములను రక్షించాలని రైతు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# సిగ్నలింగ్ వ్యవస్థ లాభమా.. నష్టమా?

కరీంనగర్: కోట్లాది రూపాయలు వెచ్చించి నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు అసలు చిక్కొచ్చిపడింది. ఆధునికతను జోడిస్తూ ఆర్భాటంగా ప్రారంభించిన ప్రక్రియ ప్రస్తుతం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ముందు చూపులేనితనమా.. లేదా కొన్నాళ్లు నిరీక్షించి చూద్దామనే ఆలోచనా..? ఏదైతేనేమి రంగుల వెలుగుల జాడలు ప్రస్తుతానికి చౌరస్తాల్లో కనిపించడంలేదు. ఆకర్షణీయ నగరంలో సమకూరుతున్న వసతుల్లో కీలకమైన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థపైనే ఇప్పుడు నగరంలో చర్చ జరుగుతోంది. ఏళ్లతరబడి నిరీక్షణను నెరవేర్చేలా ఈనెల 21న పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్, స్థానిక మంత్రి గంగుల కమలాకర్‌లు ఆర్భాటంగా వీటిని ప్రారంభించారు. ఇలా ప్రారంభించిన మరుసటి రోజు నుంచే సేవలు నిలిచిపోయాయి. అంతకుముందు సన్నాహక ప్రక్రియలో భాగంగా వరుసగా నాలుగైదు రోజులపాటు వాటి పనితీరును సాంకేతిక నిపుణులు, నగరపాలక సంస్థ అధికారులు పర్యవేక్షించారు.

రద్దీ సమస్యతోనే..సిగ్నల్ వ్యవస్థ లేనప్పుడు నగరంలోని ప్రధాన రహదారులపై ఏ ఒక్క చోట వాహనాలు ఆగిన దాఖలాలు లేవు. ఎప్పుడైతే సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రక్రియను పరిశీలించారో.. అప్పటి నుంచి వాహనాలు నలు వైపులా చాలా దూరం నిలిచిపోవడమనే సమస్య అన్ని చోట్ల కనిపించింది. వాహనదారుల నుంచి వ్యతిరేక స్వరాలు వినిపించడంతో ప్రస్తుతానికి వీటిని వినియోగించడం లేదు. గత దశాబ్ద కాలం కిందటితో పోలిస్తే నగరంలో వాహనాలు పెరిగాయి. దాదాపు 14.5 కి.మీ ఉన్న రహదారిపై ఎక్కడికక్కడ వాహనాల సంఖ్య ఇంతకంతకు పెరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య పెద్ద భారంగానే మారింది. 2014లో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 4.47 లక్షల వాహనాలుంటే ఈ ఏడాదిలో వీటి సంఖ్య 6.26 లక్షలకు పెరిగింది. పైగా ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువగా ఇతర ప్రాంతాల వాహనాలు కరీంనగర్‌కు వస్తుండటంతో రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో సిగ్నలింగ్ ఏర్పాటు అనివార్యమైంది. నగరంలో 24 చౌరస్తాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించి తొలి దఫాలో 12 చోట్ల అమర్చారు. దీనిపై 'న్యూస్‌టుడే' మేయర్ సునీల్‌రావు వివరణ కోరగా.. ప్రయాణికులు అసౌకర్యానికి గురి కాకుండా సిగ్నలింగ్ సేవలను కొనసాగిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య ఎక్కడ పెరుగుతుందో పరిశీలించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇబ్బందులమయం.. ఆర్టీసీ బస్సులు లోపలికి వెళ్లే చౌరస్తా వద్ద సిగ్నలింగ్‌తో విపరీత జాప్యం అవుతోంది. ప్రతి ఐదు నిమిషాల వ్యవధిలో నలువైపులా బస్సులో లోపలికి వెళ్తుండటం సమస్యగా మారింది.

పైగా ఈ బస్టాండ్ చౌరస్తాకు సమీపంలోనే అటు ప్రతిమ కూడలి, ఇటు బస్టాండ్ ఔట్‌గేట్, వన్‌టౌన్ పోలీసు చౌరస్తా వద్ద సిగ్నళ్లున్నాయి. వాహనాలు ఎక్కువగా నిలుస్తున్నాయి.

కొన్ని చోట్ల 200 మీటర్ల దూరంలోనే సిగ్నలింగ్ ఏర్పాటు చేసి ఉండటంతో అక్కడక్కడ ఇబ్బంది ఎదురవుతోంది. కూడళ్లు చిన్నగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేయడంతో ఇబ్బంది ఉంటుంది.

చౌరస్తాలో వాహనాలు నిరీక్షించే సమయం కూడా ఎక్కువగా ఉంది. దీన్ని మారిస్తే మేలు. అన్ని వైపుల వాహనాలు కదిలే వరకు దాదాపు 2 నిమిషాలపాటు నిరీక్షించాల్సి వస్తోంది.

ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఇక్కట్లు రెట్టింపవుతున్నాయి. పైగా వాహనాల పార్కింగ్ రోడ్లపక్కనే నిలపడంతో రహదారి పొడవునా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి.

# ఇక పురపాలికల ప్లాట్లు

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లోని అసైన్డ్ భూముల లబ్ధిదారులతో కలిసి.. వాటిని ప్లాట్లుగా చేసి విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ రెండేళ్ల క్రితమే ప్రారంభమైనా.. రాష్ట్ర పురపాలకశాఖ ఇటీవల అనుమతులిచ్చింది. దీనికోసం రెండు పురపాలికల్లో సుమారు 600 పైన ఎకరాలను గుర్తించారు. అందులో తొలివిడత వేములవాడలో 32, సిరిసిల్లలో 120 ఎకరాలు ప్లాట్లుగా మార్చనున్నారు. వీటిలో డీటీసీపీ నిబంధనల ప్రకారం లేఅవుట్లు వేస్తారు. అందులో అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు, విద్యుత్తు సరఫరా, తాగునీటి పైపులైన్లను పురపాలకశాఖ సొంత వ్యయంతో నిర్మిస్తుంది. ఈ పనుల పర్యవేక్షణ పూర్తిగా కలెక్టర్ నేతృత్వంలో జరుగుతుంది. మౌలిక వసతుల కల్పన పూర్తయ్యాక ఈ– వేలంకు వెళ్తారు. దీని ద్వారా వచ్చే ఏడాదిలో రూ.వెయ్యి కోట్ల ఆదాయం సమకూర్చుకునేలా ప్రణాళికలు చేస్తున్నారు. వీటిని పట్టణాల్లో ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తారు.

సామాన్యులకు అందుబాటులో..

వేములవాడ పురపాలిక తిప్పాపూర్ సమీపంలో బహిరంగ మార్కెట్‌లో గజం రూ.18 వేల పైన పలుకుతోంది. సిరిసిల్ల పురపాలిక పెద్దూరు సమీపంలో మాత్రం గజం రూ.8 వేల వరకు ఉంది. ఈ నేపథ్యంలో సామాన్య, మధ్య తరగతి మొదలు, ఉన్నత వర్గాల వరకు అందరికీ అందుబాటులో ఉండేలా ప్లాట్లు చేయనున్నారు. ప్రస్తుతం పురపాలికల్లోని ప్రైవేటు లే అవుట్లలో ఎక్కువగా 300 గజాలు ఆపైన ప్లాట్లే ఉన్నాయి. సాధారణ ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు అంత పెద్ద ప్లాట్లు కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారుతోంది. పురపాలికలు ఏర్పాటు చేసే ప్లాట్లలో 150 నుంచి 300 గజాల వరకు వివిధ పరిమితుల్లో ప్లాట్లుగా చేయనున్నారు. దీంతో రూ.15 లక్షలు నుంచి రూ.20 లక్షల్లో ఇంటి స్థలం అందుబాటులోకి రానుంది. మరికొందరు అనుమతుల్లేని లేఅవుట్లలో కొని మోసపోతున్నారు. కొనుగోలు చేసిన తరవాత భవనాలు నిర్మిద్దామనుకుంటే పురపాలికలు వాటికి అనుమతి ఇవ్వడం లేదు. ఇటీవల ఇలాంటివి రెండు పురపాలికల్లో భారీగా పెరుగుతూ వస్తున్నాయి. తక్కువ విస్తీర్ణంలో ప్లాట్లను అభివృద్ధి చేసి విక్రయిస్తే అవి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటాయని పురపాలిక భావిస్తోంది. ఈ విషయమై సిరిసిల్ల పురపాలిక కమిషనర్ సమ్మయ్యతో మాట్లాడగా పట్టణ పరిధిలో గుర్తించిన స్థలాల లేఅవుట్లకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని చెప్పారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో వాటిలో మౌలిక వసతుల కల్పనకు అనుమతి లభించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. మౌలిక వసతులు కల్పించాక ధరలు నిర్ణయిస్తామని, తర్వాత వేలం ద్వారా విక్రయిస్తామని చెప్పారు.రూ.14 కోట్లతో మౌలిక వసతులు

జిల్లాలోని రెండు పురపాలికల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇంటి స్థలాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి పురపాలికలు తమ ఖజానా నింపుకొనేలా ప్రణాళికలు చేస్తున్నాయి. రైతుల నుంచి సేకరించిన భూముల్లో లే అవుట్లు వేసి 60 శాతం పురపాలికలు తీసుకుని 40 శాతం రైతులకు ఇవ్వనున్నాయి. సిరిసిల్ల పట్టణం పెద్దూరు, వేములవాడ పట్టణం తిప్పాపూర్‌లో స్థలాలు గుర్తించారు. సిరిసిల్ల పురపాలిక ఆధ్వర్యంలో రూ.8 కోట్లు, వేములవాడలో రూ.6 కోట్లతో లే అవుట్లు చేసి మౌలిక వసతులు కల్పించనున్నారు.

# ఆకాశం వైపు.. అన్నదాతల చూపు

ఖమ్మం : ఉభయ జిల్లాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని మండలాల్లో భూమి పైపొరల్లో మాత్రమే కొద్దిపాటి తేమ ఉన్నా ఎండలకు ఆరిపోతోందని చెబుతున్నారు. నాటిన విత్తనాలు మొలకెత్తకపోవటంతో వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటివరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతి తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

పంట దిగుబడులపై ప్రభావం..

గతేడాది జులై 2 నాటికి అధిక వర్షాల కారణంగా గోదావరికి వరదలు వచ్చాయి. జులై 15 వరకూ విత్తనాలు వేసుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఆలస్యంగా విత్తనాలు వేస్తే దాని ప్రభావం పంటల దిగుబడులపై ఉంటుందని అనుభవం ఉన్న రైతులు చెబుతున్నారు.

లోటు వర్షపాతం..

ఖమ్మం జిల్లాలో జూన్ 1 నుంచి 27 వరకు సాధారణ వర్షపాతం



114.8 మి.మీ.కాగా కేవలం 37.6 మి.మీ. మాత్రమే కురిసింది. భద్రాద్రి జిల్లాలో సాధారణ వర్షపాతం 142.3 మి.మీ. అయితే 59.4 మి.మీ. నమోదయ్యింది.

రానున్న ఐదు రోజుల్లో వాతావరణం ఇలా..

మంగళవారం విడుదలైన వ్యవసాయ వాతావరణ బులెటిన్ సమాచారం ప్రకారం ఖమ్మం జిల్లాలో అనేకచోట్ల గత మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, అక్కడక్కడ అతి తేలికపాటి వర్షాలు కురవొచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 33.9 నుంచి 35.8 డిగ్రీల సెంటీగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రతలు 24.6 నుంచి 25.2 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదవుతాయి. ఈఆర్ఎఫ్ఎస్ వాతావరణ సమాచారం ప్రకారం ఆదివారం నుంచి జులై 8 వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం, సాధారణ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి.

# ఇంటి దొంగలను పట్టించు స్వామీ!

రామన్నపేట : వరంగల్ బాలానగర శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఒకటీ రెండు కాదు ఏకంగా తొమ్మిది వెండి చెంబులు మాయమై నెలన్నర రోజులైంది. ఇంతవరకు వాటి ఆచూకీ లేదు. నాలుగైదు రోజులు పోలీసులు, దేవాదాయ శాఖాధికారులు హడావుడి చేశారు. తర్వాత షరా మాములుగా వదిలేశారు. వెండి చెంబుల మాయం వెనుక ఇంటి దొంగలున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. మట్టెవాడ పోలీసులు ఇంతవరకు నిగ్గు తేల్చలేదు. వరంగల్ ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టలేదు. దేవుడి మీద భక్తి, కోరుకున్న కోర్కెలు తీరాయనే నమ్మకంతో భక్తులు వెండి, బంగారు వస్తువులను దేవస్థానాలకు అప్పగిస్తున్నారు. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కార్యనిర్వహణాధికారులు, అర్చకులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన దేవాలయాల్లోనూ విలువైన బంగారం, వెండి వస్తువులకు భద్రత కరవైంది. ఇంటి దొంగలను పట్టుకో ఈశ్వరా అని భక్తులు వేడుకుంటున్నారు.

ఇవిగో ఉదాహరణలు

మహబూబాబాద్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాలయంలో భక్తులు ఇస్తున్న వెండి, బంగారం వస్తువులకు ఉద్యోగులు రసీదులు కూడా ఇవ్వడం లేదు. జాతరలు, పండగల సమయాల్లో భక్తులు, దాతలు ఇచ్చే వస్తువులు, నగదు వివరాలు సరిగ్గా లేవని తెలిసింది. హనుమకొండ జిల్లాలో రెండు ఆలయాల్లో ఏటా మూడు, నాలుగు నెలల పాటు పెద్దఎత్తున జాతర జరుగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. భక్తులు దేవుడికి సమర్పించే వెండి, బంగారం వస్తువులకు జవాబుదారీతనం లేని రసీదులు జారీ చేస్తున్నారని తెలిసింది. గతేడాదిన్నర క్రితం ఒక అర్చకుడు భక్తుడి నుంచి నగదు తీసుకున్నారు. తీసుకున్నదాని కంటే తక్కువ బంగారం చూపించడంపై ఫిర్యాదు చేశారు. ఇదొక్కటే కాదు, పదుల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి.

ములుగు జిల్లాలో వన దేవతలకు భక్తులు సమర్పిస్తున్న వెండి, బంగారు వస్తువులకు రసీదులుండవు. మహా జాతర సమయంలో నిఘా ఉంటుంది. తర్వాత మామూలే. ఆదివారాలు, సెలవు దినాల్లో వేలాది మంది భక్తులు వస్తారు. దాతలు ఇస్తున్న వస్తువులు, నగదుకు సరైన రసీదులు ఇవ్వడం లేదు.

నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన అమ్మవారి ఆలయంలో అనధికార అర్చకులు, ఒప్పంద ఉద్యోగులదే పెత్తనం. ఉదయం వేళల్లో పర్యవేక్షణాధికారి, ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం లేదు. విధులకు ఆలస్యంగా వస్తున్నారు. అనధికార ఉద్యోగులే ఉంటున్నారు. విలువైన వస్తువులకు భద్రత ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

వరంగల్ ప్రాంతంలో మూడు, నాలుగు ఆలయాల్లో దేవుడి పేరుతో ఇస్తున్న బంగారు, వెండి వస్తువులను అర్చకులే తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈవోలకు కనీస సమాచారం ఉండటం లేదు.

వరంగల్ బట్టలబజారు శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో రెండేళ్ల క్రితం వెండి బిందె మాయమైంది. ఈఏడాది మే నెల 11వ తేదీన 9 వెండి చెంబులు మాయమైనట్లుగా గుర్తించారు. 14న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ దేవాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ విషయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆర్‌జేసీ దృష్టికెళ్లింది. ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైంది, నెలన్నరవుతున్నా ఇంతవరకు తేల్చలేదు. ఇంటి దొంగల వల్లే తరచుగా వస్తువులు మాయమవుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇరుకు గదులు.. అర కొర వసతులు



ఖమ్మం : పిల్లల చదువులకు తల్లిదండ్రులు ప్రాధాన్యమిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు తమ పిల్లలను పట్టణాలు, నగరాల్లోని ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంచుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఖమ్మం జిల్లాలో బీసీ విద్యార్థులకు వసతి కష్టాలు తప్పడం లేదు. అనేక హాస్టళ్లు శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొనసాగుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

33 ప్రభుత్వ బీసీ వసతిగృహాలు (పదోతరగతి లోపు విద్యార్థులకు 22) ఉన్నాయి. రెండు హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఖమ్మం ముస్తఫానగర్‌లోని బాలుర వసతిగృహం నిర్మించి సుమారు 40 ఏళ్లు అవుతోంది. భవనం లోపలి గదుల్లో పెచ్చులు ఊడుతున్నాయి. వర్షాకాలంలో కొన్ని గదులు కురుస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

వర్షాకాలం వస్తే ఇక్కట్లే

ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యనభ్యసించేందుకు బీసీ విద్యార్థులు ఖమ్మం నగరానికి వస్తున్నారు. జిల్లాలో అమ్మాయిలకు ఆరు, అబ్బాయిలకు ఐదు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఎనిమిది అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఖమ్మం నగరంలో అమ్మాయిల రెండు వసతిగృహాల భవనాలు పురాతనమైనవి. వాటి పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షాకాలం వస్తే ఇబ్బందే. చర్చికాంపౌండ్, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రభుత్వ మహిళా కళాశాల, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సుమారు 4 కి.మీ దూరంలో ఉంటాయి. అమ్మాయిలు రోజు నడుచుకుంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటారు. కళాశాలకు దగ్గర్లో వసతిగృహం నిర్మించాలని కోరుతున్నారు.శాంతినగర్ సమీపంలోని ఓ అద్దె భవనంలో మా హాస్టల్ ఉంది. ఇరుకు గదుల్లో 40 మంది వరకు ఉండొచ్చు. ఎవరైనా ప్రవేశం కోసం వస్తే వెనుక్కు పంపుతున్నారు. అందరూ పేద విద్యార్థులు. హాస్టల్‌లో సీటు దొరకక బయట కిరాయికి గదుల్లో ఉండాలంటే చాలా కష్టం. సొంత భవనం నిర్మించి మరింత మందికి వసతిగృహంలో ప్రవేశాలు కల్పించాలి.

రావుట్ల హరినాథ్, డిగ్రీ విద్యార్థి

ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఖమ్మం నగరానికి వచ్చే బీసీ విద్యార్థులకు సరైన వసతిగృహాలు లేవు. అద్దె భవనాలు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు సరిగా లేవు. ఇరుకు గదులతో పాటు కళాశాలలకు దూరంగా ఉండటంతో బాలబాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలి.

వెంకటేశ్, జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ జిల్లా వ్యాప్తంగా పాత భవనాల్లో నడుస్తున్న బీసీ వసతిగృహాల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశాలిచ్చారు. సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలను సేకరిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.జ్యోతి, జిల్లా అధికారిణి, బీసీ సంక్షేమశాఖ

# గతానికి భిన్నంగా.. ఎన్నికల సన్నద్ధత..!



ఖమ్మం : శాసనసభ ఎన్నికలకు ఉభయ జిల్లాల అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో ఎన్నికల ఏర్పాట్లు మొదలుపెట్టింది. గతంలో ఎన్నికలకు మూడు నెలల ముందు ప్రక్రియ ఆరంభమవుతుండగా ఈసారి దాదాపు ఐదు నెలల ముందే సన్నద్ధమవుతోంది. ఇప్పటికే స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు చేరగా.. ఫస్ట్ లెవల్ కమిటీ (ఎఫ్ఎల్‌సీ) పరిశీలన ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

ఉభయ జిల్లాలకు చేరిన సామగ్రి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శాసనసభ ఎన్నికల ఏర్పాట్ల కసరత్తు ముమ్మరమైంది. జిల్లాల ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు, ఓటింగ్ పరికరాల నోడల్ అధికారులుగా అదనపు కలెక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఎన్నికల సంఘం ఉభయ జిల్లాలకు చేరవేసింది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1,439 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. పోలింగ్ నిర్వహణకు 3వేల బ్యాలెట్ యూనిట్లు, 2,100 ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్)లు, 2,100 కంట్రోల్ యూనిట్ (సీయూ)లను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. భద్రాద్రి జిల్లాలో 1,092 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్ కోసం 1,976 బ్యాలెట్ యూనిట్లు, 1,867 వీవీప్యాట్లు, 1,540 కంట్రోల్ యూనిట్లు జిల్లాకు విడతల వారీగా చేరాయి.

త్వరలో మాక్ పోలింగ్..

రెండు జిల్లాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవెల్ కమిటీ (ఎఫ్ఎల్‌సీ) పరిశీలన ప్రక్రియ సాగుతోంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో అనుమానాలు, అభ్యంతరాలను అధికారులు నివృత్తి చేస్తున్నారు. రోజుకు 200 చొప్పున ఈవీఎంలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం సూచన మేరకు త్వరలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. అత్యంత కీలకమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, సీయూల పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తం కానందున వాటిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఖమ్మం జడ్పీ భవన సముదాయం, భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయాలను స్ట్రాంగ్ రూములుగా ఎంపిక చేశారు. కిటికీలు, వెంటిలేటర్లు లేకుండా వీటిని తీర్చిదిద్దారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అద్దె ఎద్దులతో అరక



ఖమ్మం : ఈ చిత్రంలో కన్పిస్తున్న యువకుడు కృష్ణాపురం గ్రామానికి చెందిన నునావత్ కాశీవిశ్వనాథ్. డిగ్రీ చదివాడు. వ్యవసాయంపై మక్కువ. కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. అద్దెకు కాడెడ్లను తెచ్చి తన వ్యవసాయం చేసుకుంటాడు. మిగతా సమయాల్లో ఇతర రైతుల పత్తి, మిరప తోటల్లో అచ్చుతోలటం, పైపాట్లు వంటి పనులతో కొంత సంపాదిస్తుంటాడు. మధిర మండలం కృష్ణాపురం రైతు పోచేపల్లి వెంకటేశ్వరరావు తన వ్యవసాయం కోసం ఏపీలోని ఏలూరు జిల్లా ఓగిరాలతండా నుంచి జత ఎద్దులను అద్దెకు తెచ్చారు. మొత్తం రూ.35 వేలు ఖర్చు అయిందని, మిరప, పత్తి, సాగుకు ఉపయోగించిన తర్వాత అదే గ్రామానికి తరలిస్తానని తెలిపారు. గతంలో ప్రతి రైతు ఇంటా పశువులు కన్పించేవి. రోజులు మారుతున్నాయి. అన్నదాతలక పశుపోషణ భారమైంది. ఎన్ని యంత్రాలొచ్చినా కొన్ని పనులను కాడెడ్లతోనే చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అద్దెకు కాడెడ్లు అందుబాటులోకి వచ్చాయి. సైకిళ్లు, యంత్రాల మాదిరిగానే ఈ సంస్కృతి విస్తరిస్తోంది. జూన్ నెల రాగానే గ్రామాలకు అద్దె ఎద్దులు వచ్చి చేరుతున్నాయి. మధిర మండలంలోనే ఏటా రెండు వందల జతల వరకు పనిచేస్తుండటం విశేషం.

అయిదు నెలలకు రూ.30 వేలు

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రైతులు కాడెడ్లను అద్దెకు ఇస్తున్నారు. జూన్ నుంచి అక్టోబర్ ఆఖరు వరకు వీటితో ఇక్కడ వ్యవసాయ పనులు చేస్తారు. పత్తి, మిరప పంటల సాగులో దుక్కిలో అచ్చుతోలటం, పైరులో పైపాట్లు చేసేందుకు వీటిని ఉపయోగిస్తారు. కొంతమంది రైతులు ఎద్దులను అద్దెకు తీసుకుని వ్యవసాయ పనులు చేసుకుంటుండగా మరికొంత మంది వీటితో బాడుగ అరకలు తోలి సంపాదిస్తున్నారు. ఎకరాకు పైపాటు చేసినప్పుడల్లా రూ.700 తీసుకుంటారు. ఒక్కొక్కరు జత ఎడ్లతో ఏటా 50 ఎకరాలను మూడు సార్లు పైపాటు చేస్తారు. దీని వల్ల దాదాపు రూ.లక్ష సంపాదిస్తారు. అయిదు నెలల కాలానికి జత ఎడ్లకు అద్దె రూ.30వేలు, రానూపోను రవాణా ఖర్చులు రూ.5వేలు వెరసి రూ.35వేలు ఖర్చు అవుతుంది. దాణా, ఇతర మేత ఖర్చులకు మరో రూ.25వేలు వెచ్చించాల్సి వస్తుంది. తమ పనులు, అన్ని ఖర్చులు పోను ఇతర రైతుల పనుల రూపేణ రూ.40వేల వరకు మిగులుబాటు అవుతుందని ఓ రైతు వివరించారు.

క్షేమంగా అప్పగించాలి..ఏపీలోని నూజివీడు పరిసర గ్రామాలైన అన్నారావుపేట, ఓగిరాల తండా, నగరం, లైన్‌తండా తదితర గ్రామాలకు చెందిన కొంత మంది ఎద్దులను పోషిస్తున్నారు. మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులు సరిహద్దులోని ఆయా ప్రాంతాలనుంచి అద్దెకు తీసుకొస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద 20 నుంచి 25 జతలు అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటాయి. రైతులు అక్కడికి వెళ్లి నచ్చిన ఎద్దులను ఎంపిక చేసుకుని ట్రాలీల్లో తీసుకొస్తారు. వాటిని యజమానులకు తిరిగి క్షేమంగా అప్పగించాలి. మధ్యలో ఓసారి వచ్చి వాటిని చూసి వెళతారు. ప్రమాదాలు జరిగినా, ఏదైనా కారణంగా మృతి చెందిన అద్దెకు తీసుకున్న వారే భరించాలి. ఇదంతా నమ్మకం మీద జరిగే తంతు అని రైతులు చెప్పారు. ఖరీఫ్ వ్యవసాయం పైపాటు పనులు పూర్తవగానే వీటిని తిరిగి యజమానులకు పంపిస్తారు. ఆ తర్వాత వాటినే డిసెంబర్ నెలలో ధాన్యం, వరిగడ్డి, చెరకు తోలేందుకు గుంటూరు జిల్లాలోని రైతులకు అద్దెకు ఇస్తుంటారు.

# ప్రభుత్వ కళాశాలకు పాలనా సౌధం

ఖమ్మం : ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)కు ఎట్టకేలకు పరిపాలనా సౌధం అందుబాటులోకి వచ్చింది. ఎక్యుమలేటెడ్ నిధులు రూ.1.05 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈనెల 20న 'విద్యా దినోత్సవం' సందర్భంగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దీన్ని ప్రారంభించారు. కళాశాలకు ఎప్పటి నుంచో ఉన్న ప్రధాన సమస్య తీరింది. ఇప్పటి వరకు కళాశాల ఇరుకు గదుల్లోనే పరిపాలన విభాగానికి సంబంధించిన వ్యవహారాలు జరిగాయి. విశాలమైన రెండతస్తుల భవనంలో ఇక నుంచి పాలనా వ్యవహారాలు కొనసాగనున్నాయి.

# సర్కారు బడి... విజయాల ఒరవడి

ఖమ్మం : పేరుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల.. ఫలితాలు చూస్తే కార్పొరేటును తలదన్నే విధంగా ఉన్నాయి. ఉపాధ్యాయుల సమష్టి కృషి.. తల్లిదండ్రుల తోడ్పాటు, విద్యార్థుల పట్టుదల వెరసి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. క్రీడల్లో మేటిగా నిలుస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు పెద్ద పీటవేస్తూ రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయం పురస్కారం అందుకుంది. ఇదీ ముదిగొండ మండలం మేడేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఘనత..

ఫలితాల్లో సత్తా

పాఠశాలలో 187మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వారి ఉన్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందిస్తున్నారు. చదువు విలువను తల్లిదండ్రులకు వివరించి పిల్లలు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా చూస్తున్నారు. తరచు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అందుకు కారణాలు తెలుసుకుంటూ వారు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణత పొందారు. జాతీయ ఉపకార వేతనాల ప్రతిభా పరీక్ష(ఎన్ఎంఎంఎస్)ల్లో ఏటా పలువురు విద్యార్థులు ఎంపిక



వుతున్నారు.క్రీడల్లో రాణింపు కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, ఫుట్బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సీఎం కప్ ఫుట్బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని యామిని బంగారు పతకం సాధించింది. విద్యార్థినులు యామిని, యువవర్షిణి, లావణ్య, కావ్యలు ఫుట్బాల్ రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. అథ్లెటిక్స్, ఖో-ఖో, కబడ్డీ క్రీడల్లోనూ రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు.

ఇవీ ప్రత్యేకతలు..

విద్యార్థులకు శుద్ధజలం అందిస్తున్నారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తారు. ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించారు. దీంతో రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయంగా ఎంపికైంది.

సమష్టి కృషితోనే సాధన: భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు

ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవడం, ప్రత్యేక తరగతులు, పటిష్ట ప్రణాళిక అమలు ఇందుకు దోహదపడ్తున్నాయి. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ రెండుసార్లు స్వచ్ఛవిద్యాలయం పురస్కారం సాధించాం.

# కూలిన వంతెనతో రవాణా కష్టాలు

జనగామ : జనగామ-హుస్నాబాద్ రహదారిపై కూలిన వంతెనతో రాకపోకలకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్లకొండ-గానుగుపహాడ్ మధ్య వాగుపై గతేడాది కురిసిన భారీ వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న వంతెన నెల రోజుల కిందట పూర్తిగా కూలిపోయింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రస్తుతం వాహనాలను జనగామ-మద్దూరు రహదారిపై గానుగుపహాడ్ గ్రామం మీదుగా దారి మళ్లించారు. ఈ రోడ్డు ఇరుకుగా, గుంతలు పడి ఉండటంతో వాహనదారులు నానా అవస్థ పడుతున్నారు. వర్షాలు మొదలైతే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

పనుల్లో ఆలస్యం..

జనగామ-హుస్నాబాద్ రహదారిపై శిథిలమైన కల్వర్టు స్థానంలో వంతెనను నిర్మించేందుకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గతంలోనే ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. టెండర్లు కూడా నిర్వహించారు. కానీ గుత్తేదారు పనులు ఆలస్యం చేశారు. ఈ క్రమంలోనే కల్వర్టు పూర్తిగా కూలి పోయింది. దీనిపై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి స్పందించి మూడు, నాలుగు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కానీ గుత్తేదారు ఇప్పుడు పనులు చేపట్టడం కష్టమని ఆసక్తి చూపడం లేదు. వర్షాకాలం పనులు సాగవని చెబుతూ వచ్చారు. ఎమ్మెల్యే ఒత్తిడి చేయడంతో 20 రోజుల కిందట పనులు ప్రారంభించినా.. ఆశించిన స్థాయిలో వేగవంతంగా పనులు సాగడం లేదు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు..

ఈ రహదారిపై కరీంనగర్, హుస్నాబాద్, తరిగొప్పుల, నర్మెట్ట, రఘునాథపల్లి, చిల్పూరు మండలాల నుంచి జనగామ మీదుగా సూర్యాపేట, హైదరాబాద్, హనుమకొండ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లేందుకు అనుకూలంగా ఉంది. వంతెన కూలిపోవడంతో వాహనాలను జనగామ-మద్దూరు రహదారిగా మీదుగా మళ్లించారు. సింగిల్ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. భారీ వాహనాలు తిరుగుతుండటంతో గానుగుపహాడ్ సమీపంలో ఉన్న వంతెనపై భారంపడి అదికూడా కుంగిపోతోంది. దీంతో అధికారులు జనగామ-హుస్నాబాద్ వైపు వెళ్లే వాహనాలను జనగామ-మద్దూరు, నర్మెట్ట-వెల్దండ రహదారి మీదుగా, జనగామకు వచ్చే వాహనాలను నర్మెట్ట నుంచి ఆగపేట, మచ్చుపహాడ్, రఘునాథపల్లి మీదుగా మళ్లిస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం..- అశోక్, ఆర్అండ్‌బీ డీఈ

జనగామ-హుస్నాబాద్ రహదారిపై వడ్లకొండ వద్ద వంతెన నిర్మాణ పనులను ఇటీవలే ప్రారంభించాం. కూలీలను సమకూర్చుకునేందుకు కొంత గడువు అవసరమైంది. మరో కొద్ది రోజుల్లో పనులు వేగవంతం చేసి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం.

# పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేదెలా?

మహబూబ్‌నగర్ : ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన నిరుద్యోగ యువతలో ఆశలు నింపింది. నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షలకు సమాయత్తం అవుతున్న యువతీ యువకులు కోచింగ్ సెంటర్ల వైపు దృష్టి సారించారు. ఇప్పటికే ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు ప్రకటనలు గుప్పిస్తూ వారికి ఆకర్షించేందుకు యత్నిస్తున్నాయి. కానీ ప్రభుత్వ పరంగా ఉచితంగా శిక్షణ అందించే స్టడీ సర్కిళ్లలో తరగతుల నిర్వహణ ఇప్పటి వరకు ప్రతిపాదన దశల్లోనే ఉన్నాయి.

జిల్లాలో ఒకే స్టడీ సర్కిల్ జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క బీసీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటికీ తరగతులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వ ఆదేశం కోసం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు. 2018లో ప్రారంభమైన బీసీ స్టడీ సర్కిల్‌లో డైరెక్టర్, కో ఆర్డినేటర్లతో కలిపి మొత్తం 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 300 వందల మంది అభ్యర్థులు వివిధ రకాల శిక్షణలను పూర్తి చేసుకున్నారు. కాగా, సర్కిల్ అద్దె భవనంలోనే కొనసాగుతుండగా, అందులోని మూడు గదులలో రెండింటిని తరగతి గదుల నిర్వహణకు వినియోగిస్తున్నారు. మరో గదిలో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను అందు బాటులో ఉంచారు. అయితే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు రాక పోవడంతో శిక్షణ పొందిన అభ్యర్థులందరూ ఇప్పటికీ ఎదురుచూపులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలోని ఉపాధి కల్పనా శాఖ కార్యాలయంలో 5,823 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 4,176 మంది యువకులు, 1,645 మంది యువతులు ఉన్నారు. మూడు కేంద్రాల కోసం ప్రతిపాదనలు గతంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 12 బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయగా, అందులో ఒకదాన్ని గద్వాలకు కేటాయించింది. గద్వాల బీసీ స్టడీ సర్కిల్ పరిధిలో గద్వాల, అలంపూరు, వనపర్తి నియోజకవర్గాలు న్నాయి. ప్రస్తుతం ప్రతీ నియోజకవర్గానికి ఒక స్టడీ



సర్కి ల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. గద్వాల పట్టణంలోని మహా రాణి ఆదిలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకటి, అలంపూరు నియోజకవర్గంలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వనపర్తి నియోజక వర్గం కోసం అక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోచింగ్ సెంట్రల్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతీ కేంద్రంలో మూడు గదులను కేటాయించ నున్నారు. ఒక గదిలో డిజిటల్ పాఠాలు, ఇంకో గదిలో అభ్యర్థుల సందేహాల నివృత్తి, మూడో గదిలో పరీక్షలకు సమాయత్తమయ్యే అవకాశం కల్పించనున్నారు. వంద మంది నిరుద్యోగ అభ్యర్థులకు వారి విద్యార్హత ఆధారంగా మెరిట్ పద్ధతిలో 75 శాతం బీసీలకు, 15 శాతం ఎస్సీలకు, పది శాతం ఎస్టీలకు కేటాయించి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. వీటిలో గ్రూప్స్ ఫౌండేషన్ శిక్షణ ఎస్ఐ, కానిస్టేబుల్, డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలోనే బోధకుల నియామకం చేపట్టి ఆయా కేంద్రాలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం. త్వరలోనే తరగతులు ప్రారంభం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 120 స్టడీసెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. గద్వాలతో పాటు స్థానిక ఎంఏఎల్‌డీ కళాశాల, అలంపూరు, వనపర్తిలలో త్వరలోనే కేంద్రాలను ప్రారంభించి నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణను అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. మొత్తం 100 మంది అభ్యర్థులు వస్తే తరగతులను ప్రారంభిస్తాం. –డైరెక్టర్, గద్వాల బీసీ స్టడీ సర్కిల్

# కాటేస్తున్న కరెంటు

వనపర్తి : వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో విద్యుత్ షాక్‌తో మరణిస్తున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రజల నిర్లక్ష్యమో.. విద్యుత్ అధికారులు, సిబ్బంది అలసత్వమో గానీ నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అధికారికంగా నమోదవుతున్న కేసులే పదుల సంఖ్యలో ఉండగా, అనాధికారిక లెక్కల ప్రకారం మరింత ఎక్కువగా ఉండొచ్చని తెలుస్తోంది. ఇటీవల ఆయా విద్యుత్ పంపిణీ సంస్థలు ఈఆర్సీ(ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్)కు ఇచ్చిన నివేదికలో విద్యుత్ షాక్‌తో మరణించిన వారి సంఖ్యను పొందుపర్చింది. తెలంగాణలోని మిగతా జిల్లాలతో పోల్చితే బోరు మోటర్ల సంఖ్య తక్కువగా ఉండే వనపర్తి, గద్వాల జిల్లాలో కూడా విద్యుత్ మరణాలు గడిచిన నాలుగేళ్లుగా పదుల సంఖ్యలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ ప్రమాదాల్లో మరణించిన వారికి పరిహారం కూడా ఏళ్లతబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు. విద్యుత్ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించకపోవడం, విద్యుత్ సరఫరా వ్యవస్థల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మనుషులు చనిపోతుండగా, మూగ జీవాలు కూడా బలవుతున్నాయి. మూగజీవాలు చనిపోయినందుకూ కొంతమేర పరిహారం ఇస్తున్నా.. అదీ ఆమోదయోగ్యంగా లేదనే అభిప్రాయం ఉంది. జోగులాంబ గద్వాల జిల్లాలో 57 మంది మృతిజోగులాంబ గద్వాల జిల్లాలో 2014 నుంచి ఇప్పటివరకు విద్యుత్ షాక్‌తో అధికారిక లెక్కల ప్రకారం 57 మంది మరణించారు. అందులో 17 మంది విద్యుత్ సరఫరా అవుతున్న పరికరాలను, వైర్లను ముట్టుకో వడం వల్ల మరణించగా, చెడిపోయిన స్టార్టర్లకు తగలడం వల్ల ఒకరు, చెడిపోయిన ఎలక్ట్రికల్ పరికరాలు తాకడం వల్ల ము గ్గురు, ఇతరుల నిర్లక్ష్యం వల్ల ముగ్గురు, వ్య క్తుల నిర్లక్ష్యం వల్ల 20 మంది, ఇతర కారణాలతో మిగతావారు మృత్యువాత పడ్డారు. ఎక్కువగా వ్యక్తుల నిర్లక్ష్యం వల్లనే మరణాలు సంభవించాయి. మరణించిన వారిలో ఇందులో విద్యుత్ శాఖకు చెందిన వారు ఒకరు ఉండగా, మిగతావారంతా సాధారణ ప్రజలు, రైతులు ఉన్నారు. 57 మంది చనిపోతే 48 మందికి పరిహారం అందించారు. మరో తొమ్మిది మందికి పరిహారం పెండింగ్‌లో ఉంది. విద్యుత్ షాక్‌తో 16 జంతువులు మరణించగా, పరిహారం కొన్నింటికే లభించింది. వనపర్తి జిల్లాలో వనపర్తి జిల్లాలో 2017 నుంచి అధికారిక లెక్కల ప్రకారం 62 మంది చనిపోయారు. 2017–18లో ఏడుగురు, 2018–19లో 11 మంది, 2019–20లో ఆరుగురు, 2020–21లో 18 మంది, 2021–22లో 20 మంది చనిపోయారు. అలాగే జంతువులు 136 మృత్యువాత పడగా, 2021–22లోనే అత్యధికంగా 40 చనిపోయాయి. మనుషుల మరణాల సంఖ్య కూడా ఈ సంవత్సరమే అధికంగా ఉండటం గమనార్హం. 62 మంది చనిపోగా, 46 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున 2.11 కోట్ల పరిహారం ఇచ్చారు. 136 జంతువులు మరణించగా, 79 మంది పోషకులకు రూ.15.20 లక్షల మేర పరిహారం అందించారు. మరణాల పెరుగుదల జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలో నీటి వనరుల లభ్యత పెరిగాక విద్యుత్ విని యోగం కూడా పెరిగింది.

# ఒకే ఒక్కటి




మహబూబ్‌నగర్ : ఉమ్మడి పాలమూరు జిల్లాలో హెచ్ఐవీ చాపకింద నీరులా వ్యాపి స్తోంది. ఆ వ్యాధిని తరిమికొట్టేందుకు, బాధితులకు మందులు ఇచ్చి పరీక్షలు చేసేందుకు ఉమ్మడి జిల్లాకు కలిపి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఒక్కటే ఏఆర్‌టీ(యాంటీ రిట్రోవైరల్ థెరపీ) సెంటర్ ఉండడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాం తాల నుంచి వ్యయప్రయాసలకోర్చి రోజుకు 300 నుంచి 350 మంది రోగులు ఓపీ కోసం వస్తున్నారు. నెలకు ఎనిమిది వేల మందికిపైగా మందుల కోసం వస్తున్నారు. అయితే వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు నెల నెలా పరీక్షలు చేయాల్సి ఉండగా, ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ ఉండడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. 18,960 మందికి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18,960 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారు. మహబూబ్‌నగర్‌లో 5,879 మంది, నాగర్‌కర్నూల్‌లో 4,354, నారాయణపేటలో 3,589, గద్వాల్‌లో 2,193, వనపర్తిలో 2,945 మంది ఉన్నారు. ఇంత మందికి కలిపి జిల్లా కేంద్రంలో ఒక్కటే ఏఆర్‌టీ సెంటర్ ఉంది. వాస్తవానికి ప్రతీ జిల్లాకు ఒక ఏఆర్‌టీ సెంటర్ ఉండాలి. కానీ కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ఏఆర్‌టీ సెంటర్లు మంజూరు చేయలేదు. తాజాగా ప్రభుత్వం వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ జిల్లాల్లో ఏఆర్‌టీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపింది. ఇందులో రెండు సెంటర్లకు మాత్రమే అవకాశం ఇచ్చేలా ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో లింక్ ఏఆర్‌టీ సెంటర్లు 10 ఉన్నాయి. అవి గద్వాల్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, షాద్‌నగర్, అలంపూర్, కొల్లాపూర్, కోడంగల్‌లలో ఉన్నాయి. కానీ అక్కడికి చాలా మంది రోగులు వెళ్లడం లేదు. అక్కడ మందులు మాత్రమే తీసుకునేందుకు అవకాశం ఉంది. ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్.. ఏఆర్‌టీ సెంటర్‌లో ముగ్గురు వైద్యాధికారులు, కౌన్సిలర్లు, డాటా మేనేజర్లు, నర్సింగ్ స్టాఫు, ఫార్మసిస్టులు ఉన్నారు. ల్యాబ్ టెక్నీషి యన్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 వేల మంది హెచ్ఐవీ బాధితులకు ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ అన్ని రకాల టెస్టులు చేస్తున్నారు. రోజూ సీడీ–4 కౌంటు టెస్టు, ప్రతీ నెల హెచ్ఐవీ వైరల్ లోడింగ్ టెస్టులు ఒక్కడే చేయాల్సి ఉండడంతో పనిభారం పెరిగి, మానసిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఒకవేళ ఆ ల్యాబ్ టెక్నీషియన్ సెలవు పెడితే దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా వెనుదిరిగి పోవాల్సిందే.

వివాదాలకు అడ్డా...ఏఆర్‌టీ సెంటర్ వివా దాలకు అడ్డాగా మారింది. కొంత కాలంగా సిబ్బంది ఒకరు తోటి సిబ్బంది విధులకు రాకపోయినా, ఆలస్యంగా వచ్చినా వారందరి సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇటీవల అందులో పనిచేసే సిబ్బంది ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నంత వరకు వెళ్లినట్లు తెలిసింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఒక వర్గానికి చెందిన వారు ఉండ డంతో వారిదే పైచేయి కొనసాగుతోందని, వారు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది. అదే వర్గానికి చెందిన కొందరు కౌన్సిలరు కౌన్సెలింగ్ పేరుతో మత మార్పిడిలపై కౌన్సెలింగ్ ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాంఏఆర్‌టీ సెంటర్‌లో కొన్ని సంఘటనలు నా దృష్టికి వచ్చాయి. వాటిపై విచారణ జరుగుతోంది. పరిశీలించి, బాధ్యులపై చర్య లు తీసుకుంటాం. ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై టీఎస్ సాక్స్‌కు లేఖ రాస్తాం.– డా. రమేష్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

# పచ్చని పొలాల్లో ఇథనాల్ పడగ

మహబూబ్‌నగర్ : నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరులో పచ్చని పంట పొలాల మధ్య నిర్మితమవుతోన్న ఇథనాల్ పరిశ్రమపై స్థానికుల్లో వ్యతిరేకత వస్తోంది. జూరాల ఆర్గానిక్ ఫార్మింగ్ అండ్ బయో ఇండస్ట్రీస్ సంస్థ దాదాపు 430 ఎకరాల విస్తీర్ణంలో రోజుకు 600 కిలో లీటర్ల సామర్థ్యంతో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమతో పాటు, 15 మెగావాట్ల బయోమాస్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్మాణాలు చేపట్టింది. రెండేళ్లలో రూ.వెయ్యి కోట్ల అంచనా వ్యయంతో ఈ పరిశ్రమలు స్థాపిస్తామని పర్యావరణ నివేదికలో పేర్కొన్న సంస్థ.. పనులను యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తోంది. చిత్తనూరు, జిన్నారం గ్రామాల మధ్య నిర్మిస్తోన్న ఈ పరిశ్రమతో పర్యావరణ కాలుష్యంతో పాటు, స్థానిక జలవనరులు, రోడ్లు ధ్వంసమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి టీఎస్–ఐపాస్ ద్వారా అన్ని అనుమతులు తెచ్చుకోవడంతో పాటు, పర్యావరణ కాలుష్యమండలి, ఇతర సంస్థల అనుమతులు కూడా తీసుకున్నామని పేర్కొంటున్న యాజమాన్యం గ్రామస్థులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగిస్తోంది. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మించొద్దని మార్చిలో రెండు పర్యాయాలు గ్రామసభల ద్వారా తీర్మానాలు చేయడంతో పాటు, కలెక్టర్‌కు రెండు సార్లు గ్రామస్థులు వినతి పత్రాలు ఇచ్చారు. అయినా కనీస చర్యలు లేకపోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ఇక్కడ నీరు కలుషితమవుతుందని, పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, పరిశ్రమ ఏర్పాటుతో ఇక్కడున్న వాగులు ధ్వంసం అవుతాయని, దిగువన 400 వరకు బోరుబావులు ఎండిపోయే ప్రమాదముందని స్థానికులు అంటున్నారు. వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పరిశ్రమను నిర్మించొద్దని డిమాండ్ చేస్తున్నారు.

నిరంతరాయంగా సాగుతోన్న పనులుజూరాల ఆర్గానిక్ ఫార్మింగ్ అండ్ బయో ఇండస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో చిత్తనూరులో సర్వే నెంబర్లు 278/పీ, 294/పీ, 295/పీ, 296/పీ, 297/పీ, 298/పీ, 307/పీ, 308/పీలో సుమారు 430 ఎకరాలు సేకరిం చింది. 126 ఎకరాల విస్తీర్ణంలో పనులు చేపట్టింది. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి సైతం స్థానికంగా ఎలాంటి అభిప్రాయసేకరణ చేపట్టకుండానే అనుమతులివ్వడంపై గ్రామస్థులు ఆరోపణలు చేస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకొని జూరాల కాల్వ నుంచి పరిశ్రమలోకి నీటిని తీసుకునేందుకు అవసరమైన కాల్వను సైతం నిర్మిస్తోంది. కాల్వ నీటిని తరలించేందుకు దరఖాస్తు చేసుకోగా, అనుమతి రాకమునుపే కాల్వ తీయడంపై స్థానిక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కోయిల్‌సాగర్‌కు ఉన్న తక్కువ కేటాయింపుల్లో ఈ కంపెనీకే ఏటా 0.09 టీఎంసీల నీరిస్తే ఆమేర ఆయకట్టుకు నష్టమని చెబుతున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రజల నుంచి కనీస అంగీకారం లేకపోయినా, నిత్యం ఆందోళనలు, నిరసనలు సాగుతున్నా పనులు మాత్రం ఆగక పోవడంతో ఆగ్ర హం వ్యక్తమవుతోంది. జిల్లా అధికార యంత్రాంగం కూడా స్థానికుల ఆవేదనను కనీసం పరిగణ నలోకి తీసు కోకుండా, గ్రామంలో ప్రజాభిప్రాయసే కరణ చేపట్టకుండా పను లు కొనసాగించ డంపై విమర్శలు వస్తున్నాయి.

వాగుల ధ్వంసంతో బోరుబావులకు ముప్పుఈ కంపెనీ నిర్మాణం కోసం జలవనరులు ధ్వంసమవుతున్నాయి. కంపెనీ నిర్మిస్తోన్న భూములను ఆనుకొని ఉన్న మల్లాపురం చెరువు అలుగు పారినప్పుడు మన్నెవాగులో కలిసే నిర్మాణాన్ని కంపెనీకి అడ్డొస్తుందని తొలగించారు. చెరువు అలుగును డైవర్ట్ చేసి, కంపెనీ భూముల్లోకి మళ్లిస్తున్నారు. అదేవిధంగా



మన్నెవాగులోకి వచ్చే మరో జలవనరైన గైనికుంట జాలుని కూడా వాగులో కలవకుండా ఆపేస్తున్నారు. ప్రభుత్వానికి సమర్పించిన నివేదికల్లో మాత్రం కంపెనీ ఈ వాగులను మళ్లించి, కంపెనీ దిగువన మళ్లీ వాగులో కలిపేలా నిర్మాణాలు చేపడతామని సూచించినా ఆమేరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. వాగులను తమ కంపెనీలోకి మళ్లించుకోవడంపై గ్రామస్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మళ్లింపుతో దిగువన మన్నెవాగుకు వరదలొచ్చినప్పుడు సైతం నీరందని పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో ఈ వాగు ఆధారంగా ఉన్న 300 పైచిలుకు బోరుబావుల పరిస్థితి ప్రశ్నార్థకమవుతుందని, సాగుపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.

కోయిల్‌సాగర్ నుంచి నీరివ్వొద్దని డిమాండ్ఈ కంపెనీకి ఏడాదిలో 330 పనిదినాలకు గాను 0.09 టీఎంసీల నీరు అవసరమని ప్రతిపాదించారు. ఈ నీటిని ఈ కంపెనీ ప్లాంటుకు అతి సమీపంలో ఉన్న కోయిల్‌సాగర్ ఎత్తిపోతల మొదటి స్టేజీ గ్రావిటీ కెనాల్ నుంచి వరద రోజుల్లో కేటాయించాలని కంపెనీ యాజమాన్యం రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించింది. కోయిల్‌సాగర్ పథకానికి ఉద్దేశించిన కోటా నుంచి ఈ ఫ్యాక్టరీకి నీరిస్తే ఆయకట్టుకు ఆమేర నీరు తగ్గిపోతోందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. కోయిల్‌సాగర్ పథకానికే 2.99 టీఎంసీల కేటాయింపులే ఉన్నాయని, ఆ కెపాసిటీ మేరకే కాల్వలు, మోటార్ల నిర్మాణాలు చేపట్టారని అంటున్నారు. ఇప్పుడు ఈ కంపెనీకి నీటిని కేటాయించినా, కాల్వలు, మోటార్ల సామర్థ్యాలు పెంచలేరని, ఉన్న నీటిని కంపెనీకి కేటాయిస్తే ఆయకట్టుకు నష్టమేనని చెబుతున్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇరిగేషన్ అధికారులు నీటి అనుమతులు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తున్నారు

పంట పొలాల మధ్య పరిశ్రమ వద్దుచుట్టూ పంటలు పండే భూములున్న చోట ఈ కంపెనీ ఎందుకు కడుతున్నారో అర్థం కావడం లేదు. ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేస్తే వచ్చే కాలుష్యంతో నీరంతా చెడిపోతుందని చెబుతున్నారు. వాగులను కంపెనీలోకి కలిపేశారు. దీంతో మాకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. 300 వరకు బోర్లు ఎండిపోయే ప్రమాదముంది. గ్రామస్థుల అభిప్రాయాలకు విలువ లేకుండా ఫ్యాక్టరీ కట్టడం తగదు. దీన్ని అడ్డుకొని తీరుతాం. వెంకటేశ్వరరెడ్డి, రైతు, చిత్తనూరు

వద్దని రెండు సార్లు తీర్మానం చేశాం ఇక్కడ ఫ్యాక్టరీ వద్దని రెండుసార్లు గ్రామ సభలో తీర్మానాలు చేశాం. కలెక్టర్‌కు రెండు సార్లు విన్నవించాం. అయినా అనుమతులు ఉన్నాయంటూ నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఇది సమంజసం కాదు. గ్రామస్థుల అభిప్రాయం లేకుండా నిర్మాణం చేపట్టడం తగదు. దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిత్తనూరు

# పట్టాలపై నెత్తుటి మరకలు

మహబూబ్‌నగర్ : క్షణికావేశం ఆత్మహత్యలకు దారితీస్తోంది. ఆవేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలుస్తున్నాయి. చదువులో ఒత్తిడిని తట్టుకోలేక.. ప్రేమించినోళ్లు దక్కలేదనో.. ఇంట్లో గొడవలు పడో తదితర కారణాల వల్ల రైలు పట్టాల పైకి వచ్చి సూసైడ్ చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా షాద్‌నగర్ మొదలు మానవపాడు వరకు నిత్యం ఎక్కడో ఒకచోట రైలు పట్టాలపై శవం కనిపించడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. గడిచిన మూడు నెలల కాలంలో 48 మంది రైలు పట్టాలపై శవాలుగా కనిపించారు. ప్రతీ ఐదు రోజులకు ముగ్గురు ఆత్మహత్య చేసుకుంటున్నారు. అందులో యువతీయువకులే మూడొంతులు ఉంటున్నారు. జడ్చర్ల–మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీ మధ్యలోనే సగం మందికిపైగా రైలు పట్టాల పైకి వచ్చి, ప్రమాదాల్లో చనిపోయారు. 2020లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైలు పట్టాలపై ఎక్కి, రైలుకింద పడి 57 మంది బలవన్మరణం పొందగా, 2021లో 96 మంది, ఈ ఏడాది మూడు నెలల కాలంలోనే 48 మంది తనువు చాలించారు. ఆవేశంలోనే అత్యధికంరైలు పట్టాలపైకి చేరి ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో ఎక్కువగా ఆవేశంతో అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నవారే అధికంగా ఉంటున్నారు. షాద్‌నగర్‌కు చెందిన ఓ పదోతరగతి విద్యార్థి తల్లి టైలర్ వృత్తి నిర్వహిస్తోంది. ఫ్యాన్ స్పీడ్‌గా పెట్టడంతో దుస్తులు గాలికి ఎగిరిపోతున్నాయని, ఫ్యాన్ చిన్నగా పెట్టుకోవాలని విద్యార్థిని ఆమె మందలించింది. దాంతో సదరు విద్యార్థి చేతిలో ఉన్న ఫోన్ నేలకు కొట్టి, బయటకు వెళ్ళిపోయాడు. కొద్దిసేపటికే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. భూత్పూర్ మండలం పోతుల మడుగుకు చెందిన ఓ యువకుడు టైలర్ వృత్తి చేసుకుంటూ, చిట్టీ వేసుకుంటున్నాడు. చిట్టీ ఎత్తిన డబ్బులు అతను ఖర్చు చేస్తాడని అతనికి ఇవ్వకుండా బంధువులు ఇతరులకు మిత్తిగా ఇచ్చారు. ఆ డబ్బుల విషయంలో గొడవపడి, పాలమూరు సమీపంలో రైలు పట్టాల పైకొచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. చదువు ఇష్టం లేదని దేవరకద్ర సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల కిందట మహబూబ్‌నగర్ మండలం చౌదర్ పల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో గొడవపడి రాత్రి వేళ రైలు పట్టాలపై పడుకోగా, రైలు మీదనుంచి పోవడంతో దుర్మరణం చెందాడు. కొందరు రైలు పట్టాలపైకి చేరి, మరికొందరు రైలు దగ్గరికి వచ్చినపుడు ఎదురెళ్ళి ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆవేశంలో ఉన్న ఆ క్షణం ఆలోచిస్తే ఆత్మహత్య ఆలోచన మానుకుంటారని మానసిక నిపుణులు చెబుతున్నారు. పాలమూరులో ఇళ్ల మధ్య నుంచి రైల్వేలైన్‌పాలమూరు పట్టణంలోని ఏనుగొండ నుంచి బండమీదిపల్లి వరకు ఆరు నుంచి ఏడు కిలో మీటర్ల మేర రైల్వే లైన్ ఇళ్ళ మధ్య నుంచి వెళ్తోంది. పట్టాలకు ఇరువైపులా ఇళ్ల సముదాయాలు ఉన్నాయి. అందుకే జనాలు ఈజీగా పట్టాలపైకి చేరి, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పట్టాలకు ఇరువైపులా ఫెన్సింగ్ ఉంటే చాలావరకు ప్రమాదాలు తగ్గిపోతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఎక్కువ ప్రమాదాలు కూడా జిల్లా కేంద్రంలోనే జరుగుతున్నాయి. ఆ తరువాత జడ్చర్ల, రాజాపూర్, దేవరకద్ర వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆవేశంలో వెంటనే పట్టాలపైకి చేరుతున్నారు. అదే ఫెన్సింగ్ ఉండి, కొంత దూరం వెళ్లాల్సివస్తే ఆ లోపు ఆవేశం తగ్గి, ఆలోచన మార్చుకునే అవకాశం ఉందని మానసిక వైద్య నిపుణులు అంటున్నారు. దీనివల్ల ఆత్మహత్యలను 50 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని అంటున్నారు.

# గం'జాయ్'

గజ్వేల్: గతంలో మద్యం మత్తుకే బానిసైన యువత ఇప్పుడు గంజాయి, ఐపీఎల్ బెట్టింగ్‌లకు బానిసలుగా మారుతున్నారు. గతంలో పట్టణాలకే పరిమితమైన ఈ దురలవాట్లు తాజాగా గ్రామాలను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా చాపకిందనీరులా విస్తరించాయి. వ్యసనాలకు అలవాటు పడిన యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. అందుబాటులో ఉన్న మొబైల్, ద్విచక్రవాహనం, మెడలో ఉన్న బంగారం ఇలా ఏది దొరికితే అది విక్రయానికి లేదా తనఖాకు పెడుతున్నారు. స్నేహితుల ఇంటికి వెళ్తున్నామని, హైదరాబాద్‌కు వెళుతున్నామని చెబుతూ తల్లిదండ్రులకు తెలియకుండా ఈ అలవాట్లను కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు వారివారి పనుల్లో బిజీగా ఉండడం పిల్లలపై దృష్టి పెట్టకపోవడంతో యువత బరితెగిస్తున్నారు. గతంలో ఇలా బెట్టింగ్‌లకు దిగిన గజ్వేల్‌కు చెందిన ఓ యువకుడు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ప్యాకెట్ రూ.500కు విక్రయంఅక్కన్నపేట, హుస్నాబాద్, గజ్వేల్ పట్టణంతో పాటు గ్రామాల్లోనూ గంజాయి ప్యాకెట్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి కొంతమంది యువకులు అక్కడ తక్కువ ధరలకు తీసుకొచ్చి గ్రామాల్లో ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. అక్కన్నపేట మండలంలోని అక్కన్నపేట, రామవరం, గౌరవెల్లి, కుందనవానిపల్లి, గండిపల్లి, కట్కూర్, అంతకపేట, మల్లంపల్లి, కేశవాపూర్, హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లంబజార్, అక్కన్నపేటరోడ్డు, ఏనే ప్రాంతం, సుభాషనగర్, వివేకానంద డిగ్రీ కాలేజ్ వీధి, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, విశాల పరపతి సహకార సంఘం ఏరియా, పందిళ్ళ, పోతారం(ఎస్) గ్రామాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విద్యార్థులు,యువకులు మత్తుకు బానిసలై గంజాయ్ ప్యాకెట్లను కొనుగోలు చేసుకొని సిగరెట్ లో పొగాకు తీసేసి ఇందులో గంజాయిని నింపి సేవిస్తుండగా, మరికొందరు ప్లాస్టిక్ బాటిల్ కు రంధ్రం చేసి గంజాయి నింపి సేవిస్తున్నారు. విద్యార్థులు, యువకులే లక్ష్యంగావిద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకుని కొందరు పట్టణ ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో గంజాయిని తీసుకొస్తున్నారు. యువత సరదాగా ప్రారంభిస్తున్న గంజాయి వాడకం క్రమేణా వారిని బానిసలుగా మారుస్తోంది. మత్తులో కొంతమంది యువకులు రాత్రి వేళల్లో బైకులపై తిరుగుతూ ప్రమాదాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొంతమంది గొడవలకు పోయి దాడులకు పాల్పడుతూ రౌడీలుగా వ్యవహరిస్తున్నారు. గంజాయి విక్రయించే కొందరు పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు రకరకాలు రూపాల్లో దర్జాగా తరలిస్తున్నారు.

గంజాయి తాగుతూ.. ఐపీఎల్ బెట్టింగ్‌స్నేహితులకు చెందిన పాంహౌజ్‌లు, ఇళ్లను, అద్దెకు తీసుకున్న గదులను అడ్డాగా మార్చుకుని ప్రత్యేకంగా టీవీలను లేదా ప్రొజెక్టర్‌లను ఏర్పాటు చేసుకుని గంజాయి పీలుస్తూ, ఐపీఎల్ మ్యాచ్‌లను చూస్తూ బెట్టింగులకు దిగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల వద్ద చెట్ల కింద, చెరువు గట్ల మీద, వైన్స్ పర్మిట్ రూంలు, బార్‌లలో ఇలా ఎక్కడ పడితే అక్కడ మద్యం, గంజాయి తాగుతూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. చేతిలో ఫోన్‌తో ఐపీఎల్ మ్యాచ్ అప్‌డేట్స్ చూస్తూ బంతిబంతికి బెట్టింగ్ పెడుతున్నారు. ఇలాంటి వాటిని మొదట్లోనే గుర్తించి, ప్రతీక్షణం ఓ కన్నేసి ఉంచితే తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును కాపాడిన వారవుతారు. పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేస్తాంగజ్వేల్ డివిజన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశాం. గ్రామస్థాయిలో అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. మరింత నిఘాను పెడతాం. ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా అన్ని రకాల వ్యవస్థలను పటిష్టం చేస్తాం. బెట్టింగ్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం చేసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతాం. – మడత రమేశ్, గజ్వేల్ ఏసీపీ

# రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రారంభం



అమరావతి: ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' ద్వారా నేటి నుంచి సచివాలయాలవారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఏపీ వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రారంభమైంది. సమస్యలు పరిష్కరించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నారు ప్రజాప్రతినిధులు.

తొలిరోజు జూలై 1వ తేదీన 1,306 సచివాలయాల పరిధిలో క్యాంపులు జరగనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు జూన్ 24వ తేదీనే ఇంటింటికీ వెళ్లి క్యాంపుల సమాచారాన్ని తెలియజేయడంతో పాటు ఆయా కుటుంబాల నుంచి వ్యక్తిగత వినతుల వివరాలను సేకరించారు. తొలిరోజు క్యాంపులకు సంబంధించి 14,29,051 కుటుంబాలకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ శుక్రవారం ఎస్ఎంఎస్ రూపంలో కూడా సమాచారాన్ని పంపింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రత్యేక క్యాంపులకు సంబంధించి 11 రకాల ప్రధాన ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలను వసూలు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జగనన్న సురక్ష కార్యక్రమం కింద జూలై 1వ తేదీ నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద నెల రోజుల పాటు నిర్దేశిత తేదీల్లో ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు




ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రత్యేక క్యాంపులలో అందే వినతులను అత్యంత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో ఏడు రోజుల ముందే దరఖాస్తులను స్వీకరించడంతోపాటు టోకెన్లను కూడా జారీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 9.48 లక్షల టోకెన్లు జారీ కాగా 6.77 లక్షల వినతుల వివరాలను సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కంప్యూటర్లలో నమోదు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అప్పటికప్పుడే పరిష్కారానికి అవకాశం ఉన్న 2.65 లక్షల వినతులకు సంబంధించి క్యాంపు నిర్వహణకు ముందే అధికారుల స్థాయిలో ఆమోద ప్రక్రియ పూర్తయ్యాయి.

# గోదావరి జిల్లాల్లో వైసీపీ ఒక్కటి కూడా గెలవకూడదు



భీమవరం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో జనసేన జెండా ఎగరాలని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వారాహి యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటిస్తున్నారు. ఆయన కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి మాట్లాడారు. కాకినాడలో నేరస్థులను ఎదుర్కోవాలంటే చట్టం తెలిసిన బలమైన నాయకుడు కావాలని ఆకాంక్షించారు. ఇక గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకూడదన్నారు.

ఇది కష్టమేనని తెలుసు.. అయినా కూడా లక్ష్య సాధన దిశగా అందరూ పనిచేయాలని కోరారు. తాను అమ్ముడుపోవాలనుకుంటే అది చాలా తేలికైన పని అని చెప్పుకొచ్చారు. వ్యక్తిగతంగా ఏ పదవో.. ఏ మంత్రి పదవో అడిగితే సరిపోతుందన్నారు. కానీ తాను ఆలోచించేది కార్యకర్తల కోసమేనని స్పష్టం చేశారు. తనకు నిరాశ నిస్పృహలు ఉంటాయి.. కానీ కొంతమంది నాయకుల రాక వలన కొత్త ఉత్సాహం వస్తుందని పవన్‌కల్యాణ్ చెప్పుకొచ్చారు.




పుణె: మహారాష్ట్రలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటన సమయంలో ప్రయాణికుల్లో చాలామంది నిద్రిస్తున్నారని, బస్సు కాలిపోవడంతో వారు నిద్రలోనే సజీవదహనమయ్యారని తెలుస్తోంది. బుల్దానా జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో కొందరు ప్రయాణికులు బస్సు కిటికీలు పగలగొట్టి ప్రాణాలతో బయటపడ్డారు. "టైరు పేలిపోవడంతో.. బస్సు డివైడర్‌ను ఢీ కొట్టింది. దాంతో క్షణాల్లో బస్సు అంతా మంటలు వ్యాపించాయి. వెనుకవైపు కిటికీలు బద్దలుకొట్టి నా తోటి ప్రయాణికుడు, నేను బయటపడ్డాం" అని ఓ ప్రయాణికుడు వెల్లడించారు. ఈ ప్రమాదం పై స్థానికుడొకరు మాట్లాడుతూ కిటికీ అద్దాలు పగలగొట్టి నలుగురైదుగురు బయటపడినా.. అందరూ అలా చేయలేకపోయారని చెప్పారు. "మమ్మల్ని సాయం కోసం బస్సులో ఉన్నవాళ్లు పిలిచారు. అయితే మేం వెళ్లేసరికే అక్కడ భయానక పరిస్థితి నెలకొని ఉంది. బస్సు లోపల ఉన్నవారు అద్దాలు పగలకొట్టేందుకు ప్రయత్నించారు కానీ సాధ్యం కాలేదు. సాయం కోసం అర్థిస్తూనే మా కళ్లముందే కాలిపోయారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మేం ముందుకు వెళ్లలేకపోయాం. వారి పరిస్థితి చూసి మాకు కన్నీరాగలేదు" అని తెలిపారు. అటుగా వెళ్తున్న వాహనదారులు ఎవరూ ప్రమాదం చూసి స్పందించలేదని, లేకపోతే మరిన్ని ప్రాణాలు కాపాడగలిగే వాళ్లమని చెప్పారు మరో ప్రయాణికుడు తెలిపారు. ఇదిలా ఉండగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఘటనాస్థలానికి చేరుకోనున్నారు. ఈ విషాదం వేళ బస్సులో 33 మంది ప్రయాణికులు ఉండగా.. 25 మంది సజీవదహనయ్యారు. మిగిలివారికి స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స అందుతోంది.

**సీఎం కేసీఆర్ సంతాపం :** మహారాష్ట్ర బస్సు ప్రమాద ఘటనపై భారాస జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంతాపం తెలిపారు.

మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

# ఆ ప్రచారం అంతా ఉత్తిదే.. వారెంతో షర్మిల కూడా అంతే అన్న చింతమోహన్



తిరుపతి: కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల చేరుతారంటూ వస్తున్న వార్తపై తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్ర నేతలు ఎవరూ కూడా షర్మిల కోసం ఇడుపులపాయకు రావటం లేదని తెలిపారు. ఈ ప్రచారం అంతా ఒట్టి అబద్ధమని స్పష్టం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని నెత్తిన పెట్టుకొని కాంగ్రెస్ తప్పు చేసిందని.. అదే పొరపాటు ఈసారి చేయదలచుకోవడం లేదన్నారు. కాసు బ్రహ్మానందం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డికి కూడా కూతుర్లు ఉన్నారని.. వారు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరొచ్చన్నారు. వారెంతో షర్మిల కూడా అంతే అని చెప్పుకొచ్చారు. షర్మిలను నెత్తిన పెట్టుకొని నాయకత్వాన్ని అప్పగించడం జరగదన్నారు. షర్మిల కోసం జరుగుతున్న ప్రచారం అంతా అబద్ధమే అని చింతామోహన్ మరోసారి తేల్చిచెప్పారు. కాగా.. గత కొద్ది రోజులుగా వైఎస్సార్టీపీని షర్మిల కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ హైకమాండ్ నుంచి షర్మిలకు పిలుపు వచ్చిందని.. ముఖ్యనేతలతో భేటీ అవుతారనే ప్రచారం కూడా జరిగింది. ఇప్పటికే వైఎస్ షర్మిల కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పలుమార్లు భేటీ అయ్యారు. ఢీకేతో భేటీ అయిన మరుసటి రోజే వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం, షర్మిల మధ్య చర్చలు జరిగినట్లుగా వార్తలు గుప్పుమన్నాయి. ఏపీలో షర్మిల సేవలను వాడుకునేందుకు వీలుగా వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రతిపాదించారని వార్తలొచ్చాయి. అయితే విలీనం వార్తలను షర్మిల ఖండించారు. తన చివరి శ్వాస వరకూ తెలంగాణ బిడ్డగా.. తెలంగాణ కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. ఊహాజనిత కథలు కల్పిస్తూ తనకు, తెలంగాణ ప్రజలకు మధ్య అగాథాన్ని సృష్టించే విఫలయత్నాలు జరుగుతున్నాయని షర్మిల ఆరోపించారు.

# అప్పన్న స్వామి గిరి ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

విశాఖపట్నం: సింహాచలం అప్పన్న స్వామి గిరి ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రేపు (ఆదివారం) సింహాచలం అప్పన్న గిరి ప్రదర్శన మొదలుకానుంది. గిరి ప్రదర్శనలో నాలుగు నుంచి ఐదు లక్షల మంది భక్తులు పాల్గొంటారని అధికారులు అంచానా వేస్తున్నారు. 32 కిలోమీటర్ల గిరి ప్రదర్శనలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశారు. జూలై 2న మధ్యాహ్నం మూడు గంటలకు స్వామివారి ప్రచార రథం తొలి పావంచ వద్ద నుంచి ప్రారంభమై 32 కిలోమీటర్లు పూర్తిచేసుకుని కొండకు చేరుకోనుంది. గిరి ప్రదర్శన పూర్తి చేసిన భక్తులకు రేపు రాత్రి 10 గంటల వరకు స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. 32 కిలోమీటర్లు నడకదారిలో వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు కావాలసిన ఆహార పదార్థాలు అందించనున్నారు.



# వైసీపీలో ఫుల్ సైలెంట్...పవన్ ఎఫెక్టేనా...?





అమరావతి : ఒకనాడు అంటే దాదాపుగా ఆరేడు నెలల క్రితం వరకూ జనసేన అధినేత పవన్ అంటే లైట్ తీసుకుని ప్రతీ వైసీపీ నేత మంత్రి మాట్లాడేందుకు ఉత్సాహంగా మీడియా ముందుకు వచ్చేవారు. ఆ విధంగా హై కమాండ్ వద్ద మార్కులు వేయించుకునేందుకు తహ తహలాడేవారు. అయితే రాను రానూ ఎన్నికలు దగ్గరపడడం రాజకీయ వేడి రాజుకోవడం జనసేనకు గ్రాఫ్ మెల్లగా పెరగడంతో వైసీపీకి చెందిన ఒక సెక్షన్ అయితే పవన్ మీద విమర్శలు చేసేందుకు వెనకా ముందూ ఆడుతోంది అని అంటున్నారు. ప్రత్యేకించి కాపు నేతలు అయితే పవన్ మీద మాట్లాడాలీ అంటే బాగా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.

దానికి కారణం తన ప్రాంతంలో ఉన్న కాపుల మనోభావాలను వారు దగ్గరుండి చూస్తున్నారు అని అంటున్నారు తాము పవన్ కి యాంటీగా మాట్లాడితే ఎక్కడ తమ కులంలో చెడ్డ అవుతామో అన్న భయం వారిలో ఉందని అంటున్నారు. అందుకే వారాహి యాత్ర పేరుతో పవన్ గత పదిహేను రోజులుగా గోదావరి జిల్లాలలో పెద్ద ఎత్తున దూకుడు చేసినా కూడా వైసీపీ నుంచి ఆ ప్రాంతం కీలక నేతలు ఎవరూ స్ట్రాంగ్ గా రియాక్ట్ కాలేదని అంటున్నారు. వైసీపీకి ఈ జిల్లాలలో నూటికి తొంబై శాతం ప్రజాప్రతినిధులు ఉన్నారు. అలాగే బలమైన కాపు సామాజికవర్గం నుంచి బిగ్ లీడర్స్ ఉన్నారు. కానీ వారు ఎందుకో నోరు మెదపడంలేదని అంటున్నారు. దానికి కారణం గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ అని అంటున్నారు. రేపటి ఎన్నికల్లో వైసీపీ నుంచి తిరిగి పోటీ చేసినా తమ ఓట్లను తాము తెచ్చుకోవడానికైనా సిద్ధంగా ఉండాలంటే హార్ష్ గా విమర్శలు చేయకపోవడమే బెటర్ అన్న ధోరణిలో చాలా మంది ఉన్నారని అంటున్నారు. ఇక పవన్ వారాహి యాత్ర తరువాత గట్టిగా ఒక్కసారి తుని ఎమ్మెల్యే మంత్రి అయిన దాడిశెట్టి రాజా మాట్లాడారు. ఇక కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వర్సెస్ పవన్ అన్నట్లుగా కొన్ని రోజులు డైలాగ్ వార్ నడచింది. మధ్యలో ముద్రగడ పద్మనాభం ఎంటర్ అయ్యారు. కానీ ఆ తరువాత అదీ లేదు. ఇక వైసీపీకి చెనిన బిగ్ షాట్స్ సీనియర్ లీడర్స్ చాలా మంది ఉన్నా ఎందుకో సైలెంట్ అయిపోయారు అని అంటున్నారు. దీంతోనే జగన్ నేరుగా పార్వతీపురం మన్యం జిల్లాలో పవన్ మీద గట్టిగా మాట్లాడాల్సి వచ్చింది అని అంటున్నారు. మరి ఇపుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పవన్ చేసే విమర్శలకు కౌంటర్ ఇచ్చే నేతలు ఎంతమంది వైసీపీలో ఉంటారు అన్నది బిగ్ క్వశ్చన్ గానే ఉంది అంటున్నారు. వైసీపీ ఇలా డిఫెన్స్ లోకి వెళ్ళడం అంటే కొంత ఆశ్చర్యకరమే అని అంటున్నారు. మరో వైపు చూస్తే కొందరు నేతలు వైసీపీ నుంచి జనసేనలోకి జంప్ చేయడానికే ఇలా మౌనం వహిస్తున్నారు అని అంటున్నారు. తాజాగా వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేరు వినిపించింది. మరి ఆయన నిజంగా జంప్ చేస్తున్నారా లేదా అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# ఇపుడు ఏపీలో అంతా 'రీల్స్' రాజకీయం



అమరావతి : సాధారణంగా యూట్యూబ్ గురించి తెలియని వారు ఎవరూ ఉండరు. ఇక సొంతగా చానెళ్లునిర్వహిస్తున్న వారు కూడా పెరిగిపో తున్నారు. ఇది ప్యాషన్కు ప్యాషన్.. ఆదాయానికి ఆదాయం అన్నట్టుగా మారిపోయింది. అయితే.. సాధారణంగా యూట్యూబ్ చూసేవారిలో ఇటీవల కాలంలో 'రీల్స్' చూస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఎందుకంటే.. కేవలం సెకన్ల వ్యవధిలోనే చెప్పాలనుకున్న విషయాన్ని సూక్ష్మంగా.. సమగ్రంగా చెప్పేస్తుండడంతోపాటు చురుక్కు.. చెమక్కులకు కూడా రీల్స్ వేదికలుగా మారాయి. దీంతో ప్రయాణ సమయంలో కానీ.. ఖాళీల సమయంలో కానీ.. ఆఖరుకు వాష్ రూముల్లో కూడా యూట్యూబ్ రీల్స్ చూస్తున్న వారు పెరుగుతున్నారు. అయితే.. విషయం ఏంటంటే.. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఏపీలో ఇప్పుడు యూట్యూబ్ రీల్స్కు డిమాండ్ పెరిగిపోయింది. నిజానికి రీల్స్లో గతంలో వంటలు.. వార్పులు.. జోకులకు ప్రాధాన్యం ఉండేది. కానీ ఇప్పుడు రీల్స్ రాజకీయాల చుట్టూ పెరుగుతున్నాయి. 10 యూట్యూబ్ రీల్స్ చూస్తే.. వాటిలో దాదాపు 8 పొలిటికల్ రీల్సే ఉంటున్నా యి. వీటిలోనూ ప్రత్యర్థి పార్టీలపై కౌంటర్లు.. జోరుగా వినిపిస్తున్నాయి. ఏపీలో కీలక నేతలు.. టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ వైసీపీ అధినేత సీఎం జగన్.. వంటివారు. గతంలో ఏమన్నారు.. ఇప్పుడు ఏం చెబుతున్నారు.. అనేవిషయాలను పోల్చి చూపిస్తూ.. రీల్సు అదరగొడుతున్నారు. నిశిత విమర్శలు.. సునిశిత చమక్కులతో ఈ రీల్స్కు ఇప్పుడు డిమాండ్ పెరిగిపోయింది. ఇక మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. వైసీపీ ఐప్యాక్ టీం టీడీపీలో ఉన్న ఐటీడీపీ వింగ్ లు.. ప్రత్యేకంగా రీల్స్ కోసం కొందరు యువతను నియమించుకున్నాయట. వీరి పని ఏంటంటే.. గత నాలుగైదేళ్ల కిందట ప్రత్యర్థి పార్టీల నేతలు.. కీలక విషయాలపై చేసిన వ్యాఖ్యలు.. ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలను జోడించి.. సెకన్ల వ్యవధి నిడివి ఉంటే రీల్సు రూపొందించి పోస్టు చేయడమేనట. వీరికి నెలకు రూ.30 - 50 వేల వరకు వేతనాలు కూడా ఇస్తున్నట్టు సమాచారం.

ఇక ఈ రీల్స్ కూడా చూస్తున్నవారిని ఆకర్షిస్తున్నాయి. ఆలోచింపచేస్తు న్నాయి. ఇక్కడ చిత్రం ఏంటంటే.. టీడీపీకి అనుకూలంగా ఉన్న రీల్స్ చూస్తే.. వైసీపీ పై ఆగ్రహం.. వైసీపీకి అనుకూలంగా ఉన్న రీల్స్ చూస్తే.. టీడీపీపై మంట వచ్చేలా అత్యంత ఆసక్తిగా రూపొందిస్తున్నారు. ఎన్నికల వాతావరణం ఊపందుకున్న నేపథ్యంలో రీల్స్కు ప్రాధాన్యం ఏర్పడిందని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.




ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో రెండో స్థానంలో ఉన్న చైనా ఆర్థిక పరిస్థితికి సంబంధించి అమెరికా వాణిజ్యశాఖకు చెందిన ఓ మాజీ అధికారి బ్రాడ్ సెట్సర్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా వద్ద 6 ట్రిలియన్ డాలర్ల విలువైన మారక నిల్వలు ఉన్నాయని.. అందులో సగం నిగూఢంగా ఉండవచ్చని అంచనా వేశారు. చైనా సెంట్రల్ బ్యాంకు అధికారిక లెక్కల్లో ఇవేవీ కనిపించవని.. వీటివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమేనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి అంతర్జాతీయ వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ ఓ కథనం వెల్లడించింది. చైనా వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల్లో ఎక్కువ భాగం పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా అధికారిక లెక్కల్లో కనిపించవని అమెరికా బ్రాడ్ సెట్సర్ పేర్కొన్నారు. షాడో నిల్వలుగా పేర్కొనే ఇవి రాష్ట్రస్థాయి వాణిజ్య రుణదాతలు, ఇతర విధాన బ్యాంకుల్లో ఉన్నాయని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. చైనా మారక నిల్వలు కొంతకాలంగా తటస్థంగా ఉన్నట్లు కనిపిస్తున్నా ఎగుమతుల పెరుగుదలతో ఈ నిగూఢ నిల్వలు కూడా పెరిగి ఉండవచ్చని అంచనా వేశారు. ప్రపంచంలో అత్యధిక విదేశీ మారక నిల్వలు కలిగిన దేశం చైనా. డ్రాగన్ వద్ద సుమారు 3.17 ట్రిలియన్ డాలర్లు ఉన్నట్లు అంచనా. అయితే, స్థానికంగా ఆర్థికంగా సమస్యలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నా.. అంతర్జాతీయ స్థాయిలో మాత్రం రుణదాతగానే ఉంది. మారక నిల్వలకు సంబంధించి పారదర్శకత లేనప్పటికీ ఆయా సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే గణాంకాల ప్రకారం అక్కడి విదేశీ మారక నిల్వలు 6 ట్రిలియన్ డాలర్లుగా ఉండవచ్చని సెట్సర్ అంచనా వేశారు. అయినా కేవలం 3.17 ట్రిలియన్ డాలర్లుగానే ఉన్నట్లు అధికారిక లెక్కలు చూపిస్తున్నాయని అన్నారు. ఇలా మారక నిల్వలకు సంబంధించి పారదర్శకంగా లేకపోవడం ప్రపంచానికి ఆందోళన కలిగించే విషయమని బ్రాడ్ సెట్సర్ అభిప్రాయపడ్డారు. చైనా తీసుకునే ఎటువంటి నిర్ణయమైనా అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించడమే ఇందుకు కారణం అన్నారు.

# పవన్‌కు మంత్రి అంబటి స్ట్రాంగ్ కౌంటర్



గుంటూరు: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్ర అంబటి రాంబాబు సీరియస్ అయ్యారు. భీమవరంలో పవన్ కల్యాణ్ రౌడీలా మాట్లాడాడు. పవన్ పిచ్చికుక్కలా స్వైరవిహారం చేశాడంటూ కామెంట్స్ చేశారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి పవన్ కల్యాణ్ అంటూ కౌంటర్ ఇచ్చారు. కాగా, మంత్రి అంబటి రాంబాబు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నా కొడకల్లారా అనే పదాన్ని ఉపయోగించిన పవన్.. రాజకీయాల్లో చీడపురుగు. పవన్ మాట్లాడే బూతులు అన్నీ పాలసీనా. ఉభయ గోదావరి జిల్లాల్లో పవన్ ఎవరి జెండా ఎగరేస్తారో చెప్పాలి. పవన్ కల్యాణ్ కులాలను రెచ్చగొడుతున్నారు. కాపులందరినీ బాబు చంక ఎక్కించాలనే పవన్ చూస్తున్నాడు. చంద్రబాబు రావాలనేది పవన్ లక్ష్యం. పెత్తందార్ల పల్లకిని మోస్తున్న వ్యక్తి పవన్. విజయం లేని, రాని రాజకీయ పార్టీ జనసేన. జనసేన వారాహి విజయ యాత్ర పేరులో మాత్రమే విజయం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల్లో పోటీ చేసే అధికారంలోకి వస్తారా? అని ప్రశ్నించారు. కేవలం డబ్బు కోసమే పవన్ ఆడే నాటకమని జనసైనికులు తెలుసుకోవాలి అని హితవు పలికారు.

## ఆవారా 2.. తమన్నా అందుకు ఒప్పుకుంటుందా..?

కార్తి హీరోగా స్టార్ డైరెక్టర్ లింగుసామి డైరెక్షన్ లో వచ్చిన సినిమా ఆవారా. తమిళ్ లో తెరకెక్కిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి ప్రేక్షకాదరణ పొందింది. ఈ సినిమాలో కార్తి సరసన మిల్కీ బ్యూటీ తమన్నా హీరోయిన్ గా నటించింది. ఆ టైం లో సూపర్ ఫాం లో ఉన్న తమన్నా ఈ సినిమాకు బాగా హెల్ప్ అయ్యింది. తమన్నా క్రేజ్ సినిమాకు తోడై సినిమా సూపర్ హిట్ అందుకుంది. ఇక 13 ఏళ్ల తర్వాత ఆవారా 2 ప్లాన్ చేస్తున్నారు. లాస్ట్ ఇయర్ రాం తో ది వారియర్ సినిమా చేసిన లింగుసామి ఆ సినిమాతో అంచనాలను అందుకోలేకపోయాడు. కార్తితో ఆవారా 2 షురూ చేస్తున్న లింగుసామి ఈ సినిమాలో బుట్ట బొమ్మ పూజా హెగ్దేని హీరోయిన్ గా తీసుకోవాలని ఫిక్స్ అయ్యారట. పూజా హెగ్దే కూడా కోలీవుడ్ లో పాగా వేయాలని చూస్తుంది. తెలుగులో ఎలాగు అవకాశాలు తగ్గడం తో పూజా హెగ్దే తమిళ పరిశ్రమ మీద కన్నేసింది. కార్తితో ఛాన్స్ అందుకున్న ఈ బ్యూటీ ఇక మీదట అక్కడ వరుస సినిమాలు



చేయాలని చూస్తుంది. అయితే లింగుసామి ఈ సినిమాలో ఆవారా పార్ట్ 1 హీరోయిన్ తమన్నాని కూడా తీసుకోవాలని అనుకుంటున్నాడట. తమన్నాకి ఈ సినిమాలో గెస్ట్ రోల్ ఇస్తున్నట్టు టాక్. ఆవారా సినిమాలో తమన్నా నటించగా పార్ట్ 2లో ఆమె కూడా కనిపిస్తే ఆడియన్స్ థ్రిల్ ఫీల్ అవుతారనే ఉద్దేశ్యంతో లింగుసామి అలా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. కొన్నాళ్లుగా డైరెక్టర్ గా ఫాం లో లేని లింగుసామి ఆవారా 2 తో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు. ఆవారా 2 మొదటి పార్ట్ కి సీక్వెల్ గా ఉంటుందా లేక కొత్త కథతో వస్తుందా అన్నది తెలియాల్సి ఉంది. లింగుసామి పందెంకోడి సినిమాకు కూడా పార్ట్ 2 తీశాడు ఆ సినిమా ఫెయిల్ అయ్యింది. అయితే ఆ సినిమా రిజల్ట్ రిపీట్ అవ్వకుండా ఆవారా 2 ని స్పెషల్ గా ప్లాన్ చేస్తున్నాడు లింగుసామి. ఆవారా 2 తెలుగులో కూడా భారీ క్రేజ్ తో రానుంది. ఆల్రెడీ కార్తి సినిమాలకు టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఉంటుంది. లాస్ట్ ఇయర్ కార్తి నటించిన సర్దార్ సినిమా కూడా తెలుగులో మంచి ఫలితాన్ని అందుకుంది. మరి ఆవారా 2 అంచనాలను అందుకుంటుందా లేదా అన్నది చూడాలి.

## మహేష్ కోసం సీనియర్ హీరోయిన్

వయసు పైబడుతున్న తరగని అందం రమ్యకృష్ణది. అలాగే మహేష్ బాబు కూడా మగవారిలో అందగాడిగా పేరు ఉంది. ఆయనకు కూడా వయసు పైపడుతున్న కొద్ది అందం పెరుగుతూ పోతోంది. ఇలాంటి వీరిద్దరూ కలిసి ఒక సినిమాలో కనిపిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చాలా మందికి వచ్చి ఉంటుంది. కానీ ఎందుకో ఇప్పటివరకు వీరిద్దరికి కాంబినేషన్ సెట్ అవ్వలేదు. కానీ ఇప్పుడు వీరి కాంబినేషన్ సెట్ అయినట్లుగా ప్రచారం జరుగుతోంది.

**అసలు విషయం ఏమిటంటే..** మహేష్ బాబు ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో తన 28వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. హారిక హాసిని క్రియేషన్స్ బ్యానర్ మీద ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో ఇప్పటికే అనేకమంది టాలెంటెడ్ నటీనటులను తీసుకున్నారు. త్రివిక్రమ్ అనుకో ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ కాంబినేషన్లో తెరకెక్కుతున్న సినిమా కోసం రమ్యకృష్ణను కూడా తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఆమె పాత్ర సినిమాలో పవర్ ఫుల్ గా ఉండబోతుందని అంటున్నారు. నిజానికి ఈ కథని



చాన్నాళ్ల క్రితమే రమ్యకృష్ణకు త్రివిక్రమ్ వినిపించాడు. కానీ అప్పట్లో ఆమె అంతగా ఆసక్తి చూపించలేదని అయితే ఇప్పుడు ఆమె నుంచే త్రివిక్రమ్ కు కబురు వెళ్లి తాను సినిమాలో భాగమవుతానని చెప్పినట్లుగా తెలుస్తోంది. నిజానికి చెప్పాలంటే ప్రతి సినిమాలో ఒక సీనియర్ నటిని బలమైన క్యారెక్టర్ ద్వారా రియంట్రీ ఇప్పించడం త్రివిక్రమ్ కు అలవాటు ఉన్న పని. ఆయన తీసిన అత్తారింటికి దారేది సినిమాతో నదియా కెరీర్ మరోసారి ఊపొందుకుంటే... అజ్ఞాతవాసి సినిమాతో కుష్బూ అలవైకుంఠపురం సినిమాతో టాబు వంటి వారు కూడా తెలుగులో బలమైన పాత్రతో రీఎంట్రీ ఇచ్చినట్టు అయింది. ఇప్పుడు ఇదే కోవాలో మహేష్ బాబు సినిమా కోసం రమ్యకృష్ణను రంగంలోకి దింపే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక ప్రస్తుతానికి ఈ సినిమా కోసం హైదరాబాద్ శివార్లలో ఒక భారీ సెటప్ అయితే సిద్ధమైంది. ఒక భారీ బంగ్లా సెట్ లో షూటింగ్ జరపడానికి అంతా సిద్ధం చేస్తున్నారు. సోమవారం నుంచి ఆ సినిమా షూటింగ్ అంతా అదే సెట్ లో జరగబోతున్నట్లుగా తెలుస్తోంది. రమ్యకృష్ణ మహేష్ బాబు కాంబినేషన్ సెట్ అయింది కానీ వీరిద్దరూ ఒకరికొకరు ఏమవుతారు అనే విషయం మీద మాత్రం క్లారిటీ లేదు.




## లుక్స్ తో టెంప్ట్ చేస్తోన్న జాతిరత్నాలు బ్యూటీ



జాతిరత్నాలు సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల ఫరియా అబ్దుల్లా. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా మంచి మార్కులు కొట్టేసింది. తన యాక్టివ్ పెర్ఫార్మెన్స్ తో అందరిని ఆకట్టుకుంది. తరువాత ఈ బ్యూటీ లైక్ షేర్ సబ్ స్క్రైబ్ మూవీలో హీరోయిన్ గా నటించింది. రావణాసుర మూవీలో కూడా ఫరియా అబ్దుల్లా నటించిన హీరోయిన్ రోల్ కాదు. కోలీవుడ్ లోకి కూడా ఈ బ్యూటీ ఇప్పటికే అడుగుపెట్టింది. గ్లామర్ పరంగా చాలా మంది హీరోయిన్స్ కంటే బెటర్ గా ఉన్నా కూడా ఫరియా అబ్దుల్లాకి హీరోయిన్ గా సరైన ఛాన్స్ లు రాకపోవడానికి కారణం ఆమె హైట్ అని చెప్పొచ్చు. అయితే సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా సోషల్ మీడియాలో మాత్రం ఫరియాకి అదిరిపోయే ఆదరణ ఉంది. అస్సలు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ని ఈ అమ్మడు ఇన్ స్టాగ్రామ్ లో సంపాదించుకుంది. రెగ్యులర్ గా డాన్స్ వీడియోలు హాట్ హాట్ ఫోటోలని ఈ అమ్మడు పంచుకుంటూ ఉంటారు. ఈ ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతాయి. తాజాగా ఈ అమ్మడు అదిరిపోయే హాట్ టెంప్టింగ్ ఫోటోలని షేర్ చేసుకున్నారు. ఇపుడు ఈ పిక్స్ ట్రెండ్ అవుతున్నాయి. వైట్ కలర్ జాకెట్ టైప్ షర్ట్ ప్యాంట్ వేసుకొని ఫరియా అందాల విందు అందిస్తోంది. నడుము అందాలు చూపిస్తూ వయ్యారంగా ఫోజులతో కుర్రాళ్ళకి వేడెక్కిస్తోంది. ఈ లుక్ లో ఫరియా అందాలు చూస్తూ ఉంటే ఎలాంటి వారైన కచ్చితంగా టెంప్ట్ అవ్వాల్సిందే అనేలా ఉన్నాయి. ఇక ఈ బ్యూటీ తమిళంలో నటిస్తోన్న వాలిమలై మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ బ్యూటీ త్రివిక్రమ్ శ్రీనివాస్ మహేష్ బాబు గుంటూరు కారం సినిమా కోసం పరిశీలించారంట. కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. మళ్ళీ చిట్టీ లాంటి పాత్రలో సిల్వర్ స్క్రీన్ పై ఫరియాని చూడటానికి ఆమె ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గ్రాఫిక్స్ తో అనుష్కని మార్చేస్తారట.. ఏంటి నిజమేనా..?







స్వీటీ అనుష్క ఒకప్పుడు వరుస సినిమాలతో తన ఫ్యాన్స్ ని అలరించేది కానీ ఈమధ్య సినిమాలకు చాలా గ్యాప్ ఇచ్చింది. బాహుబలి 2 తర్వాత భాగమతి నిశ్శబ్ధం సినిమాలు మాత్రమే చేసిన అనుష్క ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ రీసెంట్ గా నవీన్ పొలిశెట్టి సినిమాకు సైన్ చేసింది. యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనుష్క చెఫ్ గా కనిపిస్తుంది. ఇక ఈ సినిమా షూటింగ్ దాదాపు ముగింపు దశకు చేరుకోగా మరో సినిమాకు కూడా అనుష్క సైన్ చేసినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ డైరెక్టర్ ఏఎల్ విజయ్ డైరెక్షన్ లో అనుష్క సినిమా చేస్తుందని టాక్. రీసెంట్ గా అనుష్క చబ్బీ లుక్స్ మళ్లీ ఫ్యాన్స్ ని కంగారు పెట్టిస్తుంది.

సైజ్ జీరో సినిమా నుంచి అనుష్క తన లుక్స్ విషయంలో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. అనుష్క సినిమాలకు దూరమైన కారణం కూడా అదే అంటూ చెబుతున్న సందర్భాలు ఉన్నాయి. ఆమధ్య తన స్లిమ్ లుక్ ఫోటో షూట్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ సైజ్ జీరో సినిమాలానే తయారైందని టాక్. అయితే విజయ్ మాత్రం తన సినిమాలో అనుష్కని గ్రాఫిక్స్ వాడి స్లిమ్ లుక్ లో చూపిస్తానని చెప్పుకుంటున్నారు. బాహుబలి 2 లో కొన్ని సీన్స్ అలా చూపించారు. అంతేకాదు బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమీర్ ఖాన్ లాల్ సింగ్ చద్దా సినిమాలో కూడా ఆమీర్ ఖాన్ యంగ్ ఏజ్ సీన్స్ ని అలానే స్పెషల్ కెమెరా టెక్నిక్ వాడినట్టు తెలుస్తుంది. ఇప్పుడు అనుష్క సినిమాకు కూడా అదే కెమెరా టెక్నాలజీ యూస్ చేసి ఆమెను సన్నగా చూపిస్తారని టాక్. అయితే అనుష్క ఫ్యాన్స్ మాత్రం ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారు. అనుష్క తన ఫిజిక్ విషయంలో దృష్టి పెట్టకపోవడం ఫ్యాన్స్ ని నిరుత్సాహపరుస్తుంది.

గ్రాఫిక్స్ ఎంత వాడినా సరే స్క్రీన్ మీద తేలిపోతుంది. మరి అనుష్క ఎందుకిలా చేస్తుంది అంటూ ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు. అయితే అసలు విజయ్ సినిమాలో అనుష్కని టెక్నాలజీ వాడి చూపిస్తారన్నది జస్ట్ బయట వినిపిస్తున్న వార్త మాత్రమే.

అందులో నిజం ఎంత ఉంది అన్నది తెలియాల్సి ఉంది. నవీన్ పొలిశెట్టి సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ లో కొద్దిగా పర్వాలేదు అనిపించినా రీసెంట్ ఫోటోలలో అనుష్క మళ్లీ సైజ్ జీరో సినిమాలో చబ్బీ లుక్స్ తో కనిపించింది. మరి అనుష్క కెరీర్ ముగించాలని ఫిక్స్ అయ్యే ఇలా చేస్తుందా లేక సన్నబడాలని తను అనుకుంటున్నా తన వల్ల కావట్లేదా అన్నది తెలియాల్సి ఉంది. తన లుక్స్ విషయంలో అభ్యంతరం వల్లే అసలు అమ్మడు ఎక్కడ కనిపించడం కూడా మానేసిందని చెప్పుకుంటున్నారు.

## జనాల దగ్గర డబ్బుల్లేవు.. అందుకే నా సినిమాలు చూడట్లేదు!

కన్నడ సినీ పరిశ్రమ ద్వారా హీరోయిన్ గా మారిన రకుల్ ప్రీత్ సింగ్ తరువాత టాలీవుడ్ కి వచ్చి స్టార్ హీరోయిన్ అయిపోయింది. తెలుగులో దాదాపుగా బడా హీరోలు అందరితో ఆడి పాడిన ఈ భామ... తాజాగా టైమ్స్ ఆఫ్ ఇండియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి మొదలు ఓటీటీ రిలీజ్ లు బాలీవుడ్ వర్సెస్ సౌత్ ఫిలిమ్స్ తన హిట్లు ఫ్లాపులు సహా ఎన్నో విషయాలు పంచుకుంది. ఒకప్పుడు తెలుగులో టాప్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఇప్పుడు తెలుగులో సినిమా అవకాశాలు దూరమైపోవడంతో బాలీవుడ్ కి చెక్కేసింది. ఆమె కీలక పాత్రల్లో నటించిన ఐదు సినిమాలు రిలీజ్ అయ్యాయి కానీ ఆమెకు మాత్రం కాలం కలిసి రాలేదు. ఈ సినిమాలు పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోని నేపథ్యంలో ఇదే విషయాన్ని



ఆమె ముందు ప్రస్తావిస్తే తన పనిని బాక్సాఫీస్ నెంబర్లతో డిఫైన్ చేసి చెప్పలేము అని చెప్పుకొచ్చింది. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న సినిమా టికెట్ల రేట్ల గురించి ప్రస్తావిస్తూ జనాలు కూడా తెలివి మీరి పోయారని నెలకు ఒక్క సినిమానే వాళ్ళు చూడాలి అనుకుంటున్నారని చెప్పుకొచ్చింది. జనాల దగ్గర డబ్బులు లేవు... కాబట్టి వాళ్లు అత్యంత ఎక్సైట్ అయిన సినిమాకి మాత్రమే వెళుతున్నారని అన్నది. సినిమాలు ప్రతి వారం విడుదల అవుతూనే ఉంటాయి.. ఒక వారం అయితే రెండు మూడు సినిమాలు కూడా రిలీజ్ అవుతాయి. ఆడియన్స్ వచ్చి ప్రతి సినిమా చూడాలంటే ఎలా అంటూ ఆమె ప్రశ్నించింది. ముంబై లాంటి నగరాలలో ఒక సినిమా చూడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న విషయం అని కామెంట్ చేసింది. తన సినిమాలకు ప్రేక్షకులు థియేటర్లకు రాకపోవడం కూడా ఒక కారణం అని చెప్పుకొచ్చింది. తమ సినిమా ఆడియన్స్ కి నచ్చిందా లేదా అనేది తన ఆలోచిస్తానని బాక్సాఫీస్ నెంబర్ ల గురించి హిట్ ఆఫ్ లాపా అనే విషయం గురించి తాను ఆలోచించాలని ఆమె చెప్పుకొచ్చింది. లాజికల్ గా మాట్లాడితే ఆమె చెబుతున్నది కూడా కరెక్ట్ అనిపిస్తోంది కదూ.

## నయనతార విరామం వెనుక అసలు కథేంటి?

నయనతార–విఘ్నేష్ శివన్ వివాహం అనంతరం నయన్ విరామం లేకుండా సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే కథల విషయంలో మరింత సెలక్టివ్ గా ఉంటున్నారు. వీలైనంతగా ఉమెన్ సెంట్రిక్ చిత్రాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సౌత్ లో అగ్రతారగా ఆమెకున్న గుర్తింపును ఎన్ క్యాష్చేసుకునే ప్రయత్నంలో భాగంగా నయన్ కెరీర్ ఈ రకంగా స్పీడప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే తాజాగా ఆమె సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్ మీడియాలో ప్రచారం సాగుతోంది. నయన్ చేతిలో ఉన్న ప్రాజెక్ట్ లు అన్నింటిని పూర్తిచేసి కొన్నాళ్ల పాటు విశ్రాంతి తీసుకోవాలను కుంటున్నారుట. దాదాపు రెండేళ్ల పాటు ఎలాంటి సినిమాలు చేయకుండా ఇంటికే పరిమితమవ్వాలని చూస్తున్నారుట. దీంతో నయన్ విరామంపై రకరకాల కథనాలు వెలువడుతున్నాయి. పిల్లల కోసమే నయన్ రెండేళ్ల పాటు విరామం తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పిల్లలు కలిగిన తర్వాత సెకెండ్



ఇన్నింగ్స్ ని ప్రారంభించాలనే ఆలోచనతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియా కథనాలు వెడెక్కిస్తున్నాయి. మరి ఇందులో వాస్తవాలు తెలియాల్సి ఉంది. ఇక కుటుంబానికి నయన్ ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చెప్పాల్సిన పనిలేదు. కుటుంబమంటే ఎంత ఇష్టమో గతంలో చాలా ఇంటర్వ్యూల్లో రివీల్ చేసింది. తల్లికి దూరంగా చెన్నైలో ఉంటున్న ఆమెకంటూ ఓ కుటుంబాన్ని ఏర్పరుచుకుంది. ఎంతో మంది పిల్లల్ని దత్తత తీసుకుని వాళ్ల ఆలనా..పాలనా చూస్తుంది. వృద్ధాశ్రమాల్ని నిర్వహిస్తుంది. ఆ రకంగా నయన్ ప్రేమని పిల్లల..వృద్ధులపై పై చూపిస్తుంది. తాజాగా ఇప్పుడు మాతృమూర్తిగా మారాలని నిర్ణయం తీసుకున్నట్లు వినిపిస్తుంది. మరి ఈ గ్యాప్ పిల్లల్ని కనడం కోసమా? వ్యక్తిగతంగా కేవలం విరామం కోసమేనా? ఇలాంటి నిర్ణయం దిశగా అడుగులు వేస్తుందా? అన్నది తెలియాలి. ప్రస్తుతం నయనతార షారుక్ ఖాన్ హీరోగా నటిస్తోన్న బాలీవుడ్ చిత్రం జవాన్ లో నటిస్తోంది. అలాగే ఇరైవాన్ అనే తమిళ్ సినిమా చేస్తుంది. ఈ రెండు మినహా కొత్త సినిమాలకు సంతకాలు చేయలేదు. అవకాశాలు వస్తున్నా..అడ్వాన్సులు కోట్ల రూపాయలు గుమ్మరిస్తా మన్నా నిర్మాతలతో నో ఛాన్స్ అనేస్తుందిట.




# శంషాబాద్ నుంచి మూసీ వరకు ఎక్స్‌ప్రెస్‌వే: కేటీఆర్

నార్సింగి: హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుపై నార్సింగి వద్ద 29.50కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటర్‌ఛేంజ్‌ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేలా ప్రయత్నిస్తున్నామన్న ఆయన.. మూసీ నదిపైనా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాన్ని చేపడతామని వెల్లడించారు. "మురుగు నీటిని పునర్వినియోగించేలా పాలసీని తీసుకొస్తాం. సెప్టెం బర్ నాటికి హైదరాబాద్‌లో మురుగునీరు శుద్ధీకరణ పూర్తవుతుంది. రద్దీ మేరకు సర్వీస్ రోడ్లను విస్తరించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఓఆర్ఆర్‌పై 120కి.మీ. వరకు వాహనాల స్పీడు పెంచాం. మూసీ నదిపై 14 బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులిచ్చాం. శంషాబాద్ నుంచి మూసీ వరకు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తాం. త్వరలో కోకాపేట్, మల్లంపేట్‌లో ఇంటర్‌ఛేంజ్‌లు వస్తాయి. మూసీపై స్కైవే కూడా నిర్మిస్తాం. శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ?50కోట్లు కేటాయించాం. బీహెచ్‌ఈఎల్ నుంచి కందుకూరు వరకు మెట్రో విస్తరిస్తాం. హైదరాబాద్‌లో 100శాతం సీవరేజ్ ట్రీట్మెంట్ చేస్తున్నాం. మెహిదీపట్నంలో స్కైవాక్ కోసం రక్షణ మంత్రిని స్థలం అడిగాం. హైదరాబాద్ అభివృద్ధికి సహకరించాలని కేంద్రాన్ని అడిగినా స్పందనలేదు. శామీర్‌పేట్ – జేబీఎస్ స్కైవాక్ కోసం రక్షణ భూములు ఇవ్వాలని అడిగాం. భూములు కేటాయించి ప్రజలకు ప్రధాని తీపి కబురు చెప్పాలి. ఆగస్టులో హైదరాబాద్‌లో సైకిల్ ట్రాక్ ప్రారంభిస్తాం" అని కేటీఆర్ చెప్పారు. కాగా నార్సింగి వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ ఛేంజ్‌తో మంచిరేవుల, గండిపేట ప్రాంతాల ప్రయాణికులతో పాటు లంగర్‌హౌస్, శంకర్‌పల్లి నుంచి వచ్చే వారు ఓఆర్ఆర్ మీదుగా గమ్యస్థానాలకు చేరుకోడానికి ఎంతో సులువకానుంది.




పుణె: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. బుల్డానాలోని సమృద్ధి మహామార్గ్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న ఓ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 25 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. 32 మంది ప్రయాణికులతో యావత్మాల్ నుంచి పుణెకు వెళ్తుండగా శనివారం వేకువజామున 2 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. టైర్ పేలి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. మంటల ధాటికి బస్సు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను బుల్డానా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని, సీఎం..** ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని బుల్డానా ఎస్పీ వెల్లడించారు. ప్రస్తుతం మృతదేహాలను గుర్తించి, వారి కుటుంబాలకు అప్పగించడానికే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ ఆలోచనంతా వారి కుటుంబాల గురించేనని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం ప్రకటించింది.

# ఖమ్మంలో పోస్టర్ల కలకలం.. పొంగులేటి అనుచరుల శవాలు కూడా మిగలవంటూ వార్నింగ్




ఖమ్మం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న తరుణంలో ఖమ్మంలో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. పొంగులేటి అనుచరుల శవాలు కూడా మిగలవని పోస్టర్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఖమ్మంలో పలు చోట్ల ఈ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. మంత్రి పువ్వాడ అజయ్‌పై బీఆర్ఎస్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆ పోస్టర్లలో హెచ్చరికలు జారీ చేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన వర్గీయుల చేరిక నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో 2వతేదీన నిర్వహించ తలపెట్టిన సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రాహుల్‌గాంధీ రానున్న ఈ సభకు తెలంగాణ జనగర్జన సభగా నేతలు పేరుపెట్టారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఖమ్మం–వైరా రోడ్డులో ఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని వంద ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసి.. యంత్రాలు, ట్రాక్టర్ల సాయంతో చదును చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ఆ స్థలానికి సమీపంలోని మరో 50 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఓ వైపు పార్టీ నేతలు, శ్రేణులతో పాటు త్వరలో పార్టీలో చేరబోయే పొంగులేటి అనుచరులు కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు అన్ని జిల్లాల నుంచి దాదాపు 5 లక్షల మంది వరకు జనసమీకరణ చేసి తమ సత్తా చాటాలని భావిస్తున్నారు. రాహుల్‌గాంధీతోపాటు కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంతరెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, రాష్ట్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు, ఏఐసీసీ, పీసీసీ నేతలు ఈ సభకు హాజరుకానున్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు మరికొందరు ఇతర జిల్లాల నేతలు అదే సభలో కాంగ్రెసపార్టీలో చేరబోతుండటంతో కాంగ్రెస్ పార్టీ కూడా ఈసభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నందున ఈ సభ ఎన్నికల శంఖారావానికి వేదిక కానుందని, రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహాన్ని తెస్తుందని నేతలు ఆశిస్తున్నారు.

# టీ-డయాగ్నొస్టిక్స్‌లో ఉచితంగా 134 వైద్య పరీక్షలు: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్: ఆరోగ్య తెలంగాణ కోసం కృషిచేద్దామని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల వైద్య సైవలు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరుగుతున్నాయని తెలిపారు. టీ–డయాగ్నొస్టిక్స్‌లో 134 వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ కొండాపూర్ ప్రభుత్వ దవాఖాన నుంచి వర్చువల్‌గా 134 వైద్య పరీక్షలను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. టీ–డయాగ్నోస్టిక్స్ ద్వారా 134 పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం లేదని తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో టీ–డయాగ్నొస్టిక్స్ కేంద్రాలు, రేడియాలజీ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి అన్నారు. మరో రెండు జిల్లాల్లో పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వాటిని కూడా పూర్తిచేస్తామన్నారు. కరోనా సమయంలో వైద్యులు ప్రాణాలకు తెగించి



పనిచేశారని, ప్రజలను మహమ్మారిబారినుంచి రక్షించారని వెల్లడించారు. రాష్ట్రంలో వైద్యుల పనితీరు అద్భుతంగా ఉందన్నారు. వైద్యారోగ్య రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచేలా కృషిచేసిన డాక్టర్లందరికీ.. వరల్డ్ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# భారాసకు భద్రాద్రి జడ్పీ ఛైర్మన్ రాజీనామా.. 56 మంది సర్పంచులు, 26 మంది ఎంపీటీసీలు కూడా..

ఇల్లందు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారత్ రాష్ట్ర సమితి (భారాస)కు ఎదురుదెబ్బ తగిలింది. భద్రాద్రి జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య భారాసకు రాజీనామా చేశారు. కనకయ్యతో పాటు ఆయన అనుచరులు కూడా పార్టీకి రాజీనామా సమర్పించారు. ఇల్లందు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఒక జడ్పీటీసీ, 56 మంది సర్పంచులు, 26 మంది ఎంపీటీసీలు రాజీనామాలు చేశారు. అనంతరం ఇల్లందు జడ్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కనకయ్య మాట్లాడుతూ.. జులై 2న ఖమ్మంలో జరిగే కాంగ్రెస్ సభలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు.

ఈ సభకు ఇల్లందు నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి వేలాదిగా ప్రజలు హాజరవుతారని వెల్లడించారు. కోరం కనకయ్య గత కొంత కాలంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సన్నిహితంగా ఉంటున్నారని స్థానిక భారాస నేతలు, కార్యకర్తలు



అసహనం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, తనను రాజీనామా చేయమని కోరడం కాదని.. అవిశ్వాసం పెట్టండంటూ అదే స్థాయిలో కనకయ్య సైతం సవాల్ విసురుతూ వచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవికి కాకుండా కేవలం పార్టీకి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు కోరం కనకయ్య ప్రకటించారు.




# బీజేపీ సీనియర్ల మధ్య ముదురుతున్న వివాదం.. జితేందర్ రెడ్డికి ఈటల కౌంటర్

హైదరాబాద్ : బీజేపీ సీనియర్ల మధ్య వివాదం మరింత ముదురుతోంది. బీజేపీ సీనియర్ నేత జితేందర్ రెడ్డికి.. హుజురాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ సీనియర్ల మధ్య వివాదం ముదురుతోంది. జితేందర్ రెడ్డి ఎందుకు ట్వీట్ చేశారో.. ఆయన ఉద్దేశ్యం ఏంటో ఆయననే అడగాలన్నారు. వయసు, అనుభవం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదీ పడితే అది మాట్లాడకూడదన్నారు. ఎవరి గౌరవానికీ భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. ఎవరి స్వేచ్ఛ, గౌరవం తగ్గించకూడదని ఈటల పేర్కొన్నారు. తెలంగాణ బీజేపీ నాయకత్వానికి ట్రీట్‌మెంట్ అవసరమంటూ ఆ పార్టీ నేత జితేందర్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్నే రేపారు. ఓ చిన్న వీడియో ద్వారా తెలంగాణ నాయకత్వంపై జితేందర్‌రెడ్డి తన అసంతృప్తినంతా వెళ్లగక్కారు. అసలు ఆ వీడియోలో ఏముందంటే.. ఓ వ్యక్తి దున్నపోతును ట్రాలీలో ఎక్కించడానికి ట్రై చేస్తుంటాడు. అది ఎక్కకుంటే వాటి సీటుపై ఒక్క తన్ను తంతాడు. వెంటనే అది ట్రాలీ ఎక్కుతుంది. సేమ్ టు సేమ్ ట్రీట్‌మెంట్ తెలంగాణ బీజేపీ నాయకత్వానికి కూడా అవసరమని జితేందర్ రెడ్డి ఒక పోస్ట్ పెట్టారు. ఈ ట్వీట్‌ను అమిత్ షా, బీఎల్ సంతోష్, సునీల్ బన్సాల్ లాంటి అగ్రనేతలకు ట్యాగ్ చేశారు.

# బీజేపీకి తలనొప్పిగా రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారం



హైదరాబాద్ : బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. సస్పెన్షన్ తొలగించాలంటూ కార్యకర్తలు రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. రాజసింగ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఇప్పటికే పార్టీ హైకమాండ్‌కు రెండు సార్లు బండి సంజయ్ లేఖ రాశారు.

రాజసింగ్ సస్పెన్షన్ వ్యవహారంపై విజయశాంతి ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. సస్పెన్షన్ ఎత్తివేత ఆలస్యమవుతోందని కార్యకర్తలు భావిస్తున్నారని విజయశాంతి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సస్పెన్షన్ ఎత్తివేత ఆలస్యమైతే పార్టీకీ నష్టం తప్పదని కార్యకర్తలు అంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో బీజేపీకి రాజసింగ్ సస్పెన్షన్ వ్యవహారం ఇబ్బందికరంగా మారింది.

**విజయశాంతి తన ట్వీట్‌లో ఏమన్నారంటే..** "ఎమ్మెల్యే రాజాసింగ్ గారి సస్పెన్షన్ అంశంలో బీజేపీ నిర్ణయం కొంత ఆలస్యమవుతున్నట్లు మన కార్యకర్తలు అభిప్రాయపడుతున్నరు. అయితే, బండి సంజయ్ గారితో సహా రాష్ట్ర పార్టీ అంతా ఆ సస్పెన్షన్ తియ్యబడాలని మనఃపూర్వకంగా కోరుకుంటున్నము. అలాగే జరుగుతుందని నమ్ముతున్నం. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు, కార్యకర్తలు ఉన్న భారతీయ జనతా పార్టీ తన కార్యకర్తలకు న్యాయం చేసుకోకుంటే ఇంత శక్తి వస్తదా... సరైన సమయంలో అంతా మంచే జరుగుతాది. కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా ఆదరించే బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా ఆచితూచి వ్యవహరిస్తుంది. ఆలస్యమైనట్లు కనిపించినా అంతిమ నిర్ణయం కచ్చితంగా అందరికీ మంచి చేసేదే అవుతుంది" అని విజయశాంతి ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఓఆర్ఆర్‌పై ఇంటర్ చేంజ్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్: మహానగరానికి మణిహారంలా మారిన ఔటర్ రింగు రోడ్డుపై కొత్తగా మరో ఇంటర్ చేంజ్ అందుబాటులోకి వచ్చింది. నార్సింగి వద్ద రూ. 29.50 కోట్లతో నిర్మించిన ఓఆర్ఆర్ ఇంటర్ చేం జ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

గ్రేటర్ చుట్టూ 158 కి.మీ మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుపై ఇప్పటి వరకు 19 ఇంటర్ చేంజ్‌లు ఉన్నాయి. నార్సింగి, కోకాపేట నియోపొలీస్, మల్లంపేట ప్రాంతాల్లో కొత్తగా మరో మూడింటిని హెచ్ఎండీఏ నిర్మాణం చేపట్టిం ది. ఇందులో నార్సింగి ఇంటర్ చేంజ్ పనులు పూర్తికావడంతో ట్రాఫిక్‌ను అనుమతించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ నేడు దానిని ప్రారంంచారు.

**రూ. 29.50 కోట్లతో నిర్మాణం..** గ్రేటర్ చుట్టూ నిర్మిం చిన ఔటర్ రింగు రోడ్డు వరకు కోర్ సిటీ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే మార్గాలను రేడియల్ రోడ్లుగా గుర్తించి ఎంతో విశాలంగా, సిగ్నల్ అవసరమే లేకుండా ఇంటర్ చేంజ్‌లను నిర్మించారు.

ఇలా మొత్తం ఓఆర్ఆర్ మీద 19 చోట్ల నిర్మించగా, నార్సింగి వద్ద మాత్రం కేవలం ఓఆర్ఆర్‌మార్గం కింద నుంచి వెళ్లగా శంక ర్‌పల్లి వైపు వెళ్లే మార్గం వద్ద ఫ్లై ఓవర్ నిర్మించారు . ఇంటర్ చేంజ్‌ను నిర్మించాల్సిన చోట కేవలం ఫ్లై ఓవర్ నిర్మించడంతో.. ఇప్పుడు ఇక్కడ నెల కొన్న సమస్య కోసం కొత్తగా ఇంటర్ చేంజ్ నిర్మాణానికి చేపట్టినా ఎన్నో ఇబ్బం దు లు తలెత్తాయి. గండిపేట నుంచి వచ్చే మూసీ నదికి తోడు మెహిదీ పట్నం నుంచి శంకర్‌పల్లి వెళ్లే మార్గంలో భూసేకరణ చేయలేదు. దీంతో కొంత కాలంగా నార్సింగి ఇంటర్ చేంజ్ పనులకు సాంకేతి కంగా అడ్డంకులు ఎదురైనా, వాటిని పరిష్కరించి నిర్మాణాన్ని పూర్తిచేశా రు. ఇందు కోసం మొత్తం



రూ. 29.50 కోట్లతో నార్సింగి ఓఆ ర్ఆర్ ఇంటర్ చేంజ్ పనులను పూర్తి చేశా మని హెచ్ఎం డీఏ అధి కా రులు తెలి పారు.

**నార్సింగి ఓఆర్ఆర్ జంక్షన్..** ఐటీ కంపెనీలు పెద్ద ఎత్తున నగరంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా పడమర దిక్కున ఉన్న ఐటీ కారిడార్ ప్రాంతం శరవేగంగా విస్తరి స్తు న్నది. ఐటీ కారి డార్ నుంచి శంషాబాద్ విమానాశ్రయంతోపాటు బెంగళూరు, శ్రీశైలం, నాగార్జునసాగర్, విజయవాడ వంటి జాతీయ రహదారులవైపు వెళ్లేం దుకు ఔటర్ రింగురోడ్డు అందుబాటులో ఉంది. ఓఆర్ఆర్‌పై ఉండే ట్రాఫిక్ మొత్తంలో సింహ భాగం ఐటీ కారిడార్ నుంచే ఉంటున్నది. ప్రధానంగా జూబ్లీహిల్స్, మాదాపూర్‌తోపాటు మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతోపాటు నానక్‌రాంగూడ, పుప్పాల్‌గూడ, కోకాపేట, మణికొండ, నార్సింగి ప్రాంతాల నుంచి ఔటర్‌పై రాకపోలు సాగించే వారిసంఖ్య గణనీయంగా పెరిగింది.

# జులై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు.. మొదటిసారి కొత్త భవనంలో...



దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 20 నుంచి ఆగస్టు 11 వరకు వర్షాకాల సమావేశాలు జరగనున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈసారి సమావేశాలు తొలుత పాత భవనంలో ప్రారంభమై, మధ్యలో కొత్త భవనంలోకి మారతాయని ఇటీవల అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఈ సమావేశాల్లోనే కీలక బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్రం యోచిస్తోందని సమాచారం. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈసారి ఆ జాబితాలో ఉంది అంటున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే చాలా మంది పార్లమెంటు సభ్యుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. యూసీసీని కొన్ని పార్టీలు వ్యతిరేకిస్తుండగా.. మరికొన్ని పార్టీలు మద్దతు ఇచ్చే యోచనలో ఉన్నాయి. అలాగే దీంతోపాటు దిల్లీ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల విషయంలో తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై బిల్లును ప్రవేశపెట్టనుందని భోగట్టా. ఈ ఆర్డినెన్స్‌పై కేంద్రం, ఆప్ ప్రభుత్వం మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆప్ ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇవే చివరి వర్షాకాల సమావేశాలు.

ఆ ఎన్నికల్లో భాజపాను గద్దె దింపే లక్ష్యంతో విపక్ష పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ సమయంలో వివిధ అంశాల్లో అధికార పక్షం భాజపాను ఆ పార్టీలు గట్టిగానే ప్రశ్నించనున్నాయని తెలుస్తోంది. మణిపుర్ ఘర్షణలపై ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టొచ్చని సమాచారం. ఇదిలా ఉండగా మే 28న ప్రధాని మోదీ పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# విమానాశ్రయంలో చిక్కుకుపోయిన ప్రయాణికులు.. ప్రైవేట్ జెట్ ఎక్కిన సీఈవో

విమానాశ్రయంలో చిక్కుకుపోయిన వేలాది మంది ప్రయాణికులను వదిలేసి ఎయిర్‌లైన్స్ సీఈవో ప్రైవేటు జెట్‌లో ప్రయాణించిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. ప్రయాణికుల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా ఆయన చేసిన పని... తీవ్ర విమర్శలకు దారి తీసింది. అసలు ఏం జరిగిందంటే? బుధవారం అమెరికావ్యాప్తంగా 750 యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సర్వీసులు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయంలోనే చిక్కుకున్నారు. అయితే ఎయిర్‌లైన్ సీఈఓ స్కాట్ కిర్బీ మాత్రం న్యూజెర్సీలోని టెటర్‌బోరో నుంచి డెన్వర్‌కు తన ప్రైవేటు విమానంలో ప్రయాణించారు. దీంతో అతని తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రయాణికులను వదిలేసి ఆయన అలా ప్రైవేటు విమానంలో వెళ్లడం సరికాదంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేశారు. అయితే కిర్బీ తాను చేసిన పనికి క్షమాపణలు తెలిపారు. ఇకపై ఇలా చేయను అని కూడా చెప్పారు. "తమ గమ్యాలకు చేరుకోవటానికి ప్రయాణికులు ఎదురుచూస్తున్నప్పుడు నేను ప్రైవేటు విమానంలో వెళ్లటం తప్పుడు నిర్ణయం. నేను చేసిన పనికి ప్రయాణికులకు, మా టీమ్ సభ్యులకు క్షమాపణలు చెబుతున్నా" అని కిర్బీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇకపై ఎప్పుడూ ఇలా చేయనని మాటిచ్చారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ వారంలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ 3,000 విమాన సర్వీసులను రద్దు చేసింది. అయితే ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌ల కొరత కారణంగానే విమాన ప్రయాణాల్లో అంతరాయాలు ఏర్పడుతున్నాయని కిర్బీ ఆరోపించడం గమనార్హం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com